
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 24 డిసెంబరు 2024



● చొరవ చూపని ఏపీసీపీడీసీఎల్ ● మూడు జిల్లాలు కలిపినా వెయ్యి లోపే కనెక్షన్లు ● అధిక ప్రయోజనాలను షార్టు వీడియోల ద్వారా ప్రదర్శించాలి ● కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు

సూర్యఘర్ స్కీమ్.. అమలులో

నిర్లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన (పీఎంఎస్‌జీవై) స్కీమ్ అమలులో మూడు జిల్లాలు వెనకబడిపోయాయి. ఈ పథకం అమలులోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా నామమాత్రంగానే రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లను డిస్కమ్ సంస్థలు ఏర్పాటు చేయడం వాటి నిర్లక్ష్యాన్ని ఎండగడుతున్నాయి. జిల్లాలకు ఇచ్చిన లక్ష్యంలో కనీసం 10 శాతం కూడా అధిగమించలేని దుస్థితి కొనసాగుతున్నది. ప్రధానంగా ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కొరవడింది. దీనివలన కలిగే ప్రయోజనాలను వివరించడంలో డిస్కమ్ అధికారులు విఫలమయ్యారు. కేవలం కరపత్రాల పంపిణీకే పరిమితం కావడం స్కీమ్ అమలుపై ప్రభావం చూపిస్తున్నది. దీంతో ప్రతీ ఇల్లు ఒక సౌర విద్యుత్ ఉత్పాదక యూనిట్ కావాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆశయం నీరుగారి పోతున్నది.

విద్యుత్ బిల్లులు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు భారంగా మారుతున్నాయి. ట్రూఅప్ ఛార్జీల పేరుతో మోపుతున్న భారంతో కరెంటు బిల్లులు ప్రతీ నెలా షాకిస్తున్నాయి. దీనివలన ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొన్న కేంద్ర ప్రభుత్వం 2022 జూలై నెలలోనే పీఎం సూర్యఘర్ యోజన స్కీమ్‌ని అమలులోకి తీసుకొచ్చింది. వినియోగదారుడు ప్రతీ నెలా

పీఎం సూర్యఘర్ యోజన స్కీమ్ కింద ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్



ఖర్చు చేసే విద్యుత్ యూనిట్ల ఆధారంగా రూఫ్‌టాప్ సోలార్ పవర్‌ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కిలోవాట్ మొదలుకొని 3 కేడబ్ల్యూ వరకు ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉన్నది. రూ. 2 లక్షల విలువ చేసే సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 72 వేల వరకు సబ్సిడీ ఇస్తున్నది. మిగతాది బ్యాంకుల నుంచి రుణం మంజూరు చేయిస్తున్నది.

ఏడాదిలో కనీసం 9 నెలల పాటు గరిష్ఠంగా విద్యుత్‌ని ఈ సోలార్‌ప్లాంట్ ఉత్పత్తి చేస్తుంది. గృహావసరానికి పోను మిగులు విద్యుత్‌ని డిస్కమ్ తీసుకొని సర్దుబాటు చేస్తుంది. ఒక విధంగా మిగులు విద్యుత్ వలన జరిగే బిల్లు ఆదాతో బ్యాంకు రుణం తీర్చవచ్చన్నది కేంద్ర ప్రభుత్వ వాదన. అయితే రిజిస్ట్రేషన్ మొదలుకొని వెండార్ ఎంపిక, బ్యాంకు రుణం పొందడంలో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. ఇది కూడా పథకం నెమ్మదించడానికి ఒక కారణంగా ఉన్నది. పీఎం సూర్యఘర్ వెబ్‌సైట్‌లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లకి ప్లాంట్ ఇన్‌స్టలేషన్ గణాంకాలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. బాపట్ల జిల్లాలో 6319 రిజిస్ట్రేషన్లు జరిగితే అప్లికేషన్లు మాత్రం 1,735 మాత్రమే ప్రాసెస్ అయ్యాయి. వాటిల్లో ఇప్పటివరకు ఇన్‌స్టలేషన్ జరిగింది 231 మాత్రమే. ఇక సబ్సిడీ అయితే 140 కనెక్షన్లకే విడుదల చేశారు. గుంటూరు జిల్లాలో 16 వేల పైచిలుకు రిజిస్ట్రేషన్లు నమోదు జరిగితే, అప్లికేషన్లు 5 వేల నుంచి 6 వేల మధ్యనే ఉన్నాయి. వాటిల్లో 631 ప్లాంట్ల ఇన్‌స్టలేషన్ జరిగింది. సబ్సిడీ అయితే ఇందులో 364 మందికి విడుదలైంది. పల్నాడు జిల్లాలో 10318 రిజిస్ట్రేషన్లు జరుగగా 1281 అప్లికేషన్లు ప్రాసెసింగ్ జరిగింది. వాటిల్లో ఇన్‌స్టాల్ అయినవి 133 మాత్రమే. సబ్సిడీ అయితే కేవలం 56 మందికే వచ్చింది. ఈ గణాంకాలు పరిశీలిస్తే మూడు జిల్లాల పురోగతి చాలా పూర్‌గా ఉండటంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంత్రి పెమ్మసాని, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్ సమీక్షలు ప్రారంభించారు. విద్యుత్ అధికారులు స్వయం సహాయక సంఘాలను సమన్వయం చేసుకొని ప్రజల వద్దకు వెళ్లి లాభాలను వివరించి పీఎం సూర్యఘర్ యోజన్ స్కీమ్‌ని పురోగతిలోకి తీసుకురావాలని ఆదేశించారు. మరో మూడు నెలల్లో మళ్లీ సమీక్ష ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రభుత్వ జీవోనూ...

పట్టించుకోవడం లేదు

ఈవీలపై వీడని 'పన్ను'పోటు!



- ఈనెల 11 నుంచే అమలులోకి రావాల్సిన 'ఏపీ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ'
- జీవో విడుదలై పక్షం కావస్తున్నా దక్కని పన్ను రాయితీ
- అధికారుల నిర్వాకంతో ప్రభుత్వ లక్ష్యానికి దెబ్బ
- పాలసీ అమలు చేయకపోవడంతో లబ్ధిదారులపై భారీ మోత

రాష్ట్రంలో విద్యుత్ వాహనాలపై ఇప్పటికీ పన్ను పోటు తప్పడం లేదు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీలను అమలు చేయడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం ప్రభుత్వ లక్ష్యాన్ని ఘోరంగా దెబ్బతీస్తోంది. దేవుడు వరమిచ్చినా పూజారి మాత్రం కనికరించ లేదన్న చందంగా రాష్ట్ర రవాణా శాఖ వినియోగదారులపైనా మోయలేని భారాన్ని వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహనాలపై కొత్త పాలసీని అమలులోకి తీసుకువచ్చి పక్షం రోజులు అవుతున్నా అది ఇంత వరకూ అమలులోకి రాకపోవడం పట్ల సర్వత్రా చర్చ సాగుతోంది.

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డిసెం బరు 11న రాష్ట్ర ప్రభుత్వం 'ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0'ను విడుదల చేసింది. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం ఆ జీవోను విడు దల చేసింది. విద్యుత్ వాహనాల ఉత్పత్తిదారులు, విక్రేతలు, వినియోగదారులకు ఎన్నో రకాల రాయితీలు, ప్రోత్సాహకాలను ఆ జీవోలో ప్రభుత్వం ప్రకటించింది. 2024 డిసెంబరు 11 నుంచి 2029 డిసెంబరు 10వ తేదీ వరకూ అమలులో ఉండే ఆ జీవో తాలూకు ప్రయోజనాలన్నీ డిసెంబరు 11 నుంచే అమలులోకి వస్తాయని స్పష్టంగా జీవోలో పేర్కొన్నారు. అయితే ఆ జీవో ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు. జీవోను అమలులోకి తీసుకురావాల్సిన రవాణా శాఖ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి స్పష్టతా రాలేదు.

ప్రతిసారీ ఇదే తంతు..?

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏపీ విద్యుత్ పాలసీని రూపొందించింది. దాని గడువు 2023తో ముగిసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందించకుండా పాత పాలసీనే పొడిగిస్తూ వచ్చింది. ఇలా గడువు ముగిసిన ప్రతి సారీ వినియోగదారులపై 12 శాతం రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీల భారం పడింది. దీంతో వినియోగదారులు భారీ మొత్తంలో నష్టపోవాల్సి వచ్చింది. జీవో గడువు ముగిసిన రెండు మూడు నెలల వరకూ జీవోని



పునరుద్ధరించక పోవడంతో ఆ సమయంలో కొన్న వినియోగదారులు 12 శాతం చొప్పున రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు భారీ మొత్తంలో చెల్లించాల్సి వచ్చింది. తాజాగా జూన్ 7న గడువు ముగిస్తే దాన్ని తిరిగి పునరుద్ధరించడానికి అక్టోబరు వరకూ ఆగాల్సి వచ్చింది. దీంతో ఆ 4 నెలల కాలంలో విద్యుత్ వాహనాలు కొన్నవారిపై 13 నుంచి 2 లక్షల వరకూ భారం పడింది. విద్యుత్ కార్లు కొన్నవారికి రూ. 4 లక్షల వరకూ భారం పడింది. కాగా అక్టోబరులో పొడిగించిన జీవో జూన్ 7 నుంచి డిసెంబరు 7వ తేదీ వరకూ మాత్రమే అమలులో ఉంది. అయితే కొత్తగా వాహనాలు కొనుగోలు చేయాలనుకునేవారు దసరా, దీపావళి పండుగ సమయాల్లోనే వాహనాలను కొంటారు. ఆ సమయంలో పన్ను రాయితీ లేకపోవడంతో వాహనాలు కొన్నవారంతా

(మిగతా 6వ పేజీలో)

దెబ్బతింటున్న ప్రభుత్వ లక్ష్యం..

విద్యుత్ వాహనాల వినియోగంలో రాష్ట్రం చాలా వెనుకంజలో ఉంది. 2024 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 1.78 కోట్ల విద్యుత్ వాహనాలు ఉండగా, అందులో విద్యుత్ వాహనాల వాటా నామమాత్రమే. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షా 30వేల విద్యుత్ వాహనాలు, 817 హైబ్రిడ్ విద్యుత్ వాహనాలు మాత్రమే వున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈవీ వాహనాలను ప్రోత్సహించడంపై దృష్టిపెట్టింది. 2018లో రూపొందించిన పాలసీ గడువు 2023తో పూర్తవగా, గత వైసీపీ ప్రభుత్వం ఆరు నెలలు చొప్పున రెండు సార్లు పొడిగించింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరులో మరోమారు పొడిగించింది. ఈ గడువు కూడా డిసెంబరు 7తో పూర్తయింది. పొడిగింపుల పర్వానికి స్వస్తి చెబుతూ కూటమి ప్రభుత్వం తాజా గడువు ముగిసిన మూడు రోజుల్లోనే కొత్త పాలసీని ప్రకటించింది. ఆ పాలసీ ద్వారా 2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ టూ వీలర్స్, 10వేల త్రీ వీలర్స్, 20 వేల ఫోర్ వీలర్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం చూపిన చొరవను ఏమాత్రం పట్టించుకోని రవాణా శాఖ అధికారులు దాని అమలుపై మీన మేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యం దెబ్బతింటోంది.

ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై
అభిప్రాయ సేకరణ
● ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా రాక
● 30న జిల్లా అధికారులతో సమావేశం
● కుల సంఘాల నుంచి వినతుల స్వీకరణ
6
సీఎం పర్యటనను
విజయవంతం చేయాలి
అధికారులకు సూచించిన కలెక్టర్ అరుణ్‌బాబు
పులిపాడులో హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన

సేంద్రియ
ఆహారంతోనే ఆరోగ్యం
● డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు
8
అవిశ్రాంత సాహితీ శ్రామికుడు..
లక్ష్మీనారాయణ
● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్

జనవరి నుంచి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం

6



- సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలకే నిధులు
- భవన నిర్మాణాలకు 15 రోజుల్లోనే అనుమతులు
- పురపాలక శాఖ మంత్రి నారాయణ

ఏఎన్‌యూలో జరిగిన మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్ల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ, వేదిక పైన కన్నబాబు, ఇతర అధికారులు

8




క్రిస్మస్ సందడి

- నూతన శోభ సంతరించుకున్న చర్చిలు
- ఆకర్షణీయ రంగులతో వెలుగొందుతున్న స్టార్లు
- కిటకిటలాడుతున్న దుకాణాలు

సీఐలకు అచ్చిరాని

వెస్ట్ సబ్ డివిజన్

నాలుగు నెలల్లో ముగ్గురిపై వేటు
తాజాగా నగరంపాలెం సీఐ వీరనాయక్‌పై వేటు



గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోనే కాక రేంజ్ పరిధిలో అత్యంత కీలకమైన గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ సీఐలకు కలిసి రావడం లేదు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పట్టాభిపురం, అరండల్‌పేట, నగరం పాలెం పోలీస్ స్టేషన్‌లు ఉండగా గడిచిన నాలుగు నెలల వ్యవధిలో ముగ్గురు సీఐలపై వేటు పడింది. తొలుత పట్టాభిపురం సీఐగా కిరణ్ నియమితులయ్యారు. ఆయన నెల రోజులు మాత్రమే విధులు నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి భర్త రామచంద్రరావుకు చెందిన రియల్ ఎస్టేట్ వివాదంలో కమ్మ వెంకటరావు అనే వ్యక్తిపై దుండగులు దాడి చేసి కొట్టడమే కాకుండా ఆయనపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం సంచలనం రేపింది. అప్పట్లో ఈ వ్యవహారం రాజకీయ దుమారం రేపింది. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ ఘటన వెనక అప్పటి పట్టాభిపురం సీఐ కిరణ్ నిర్లక్ష్య వైఖరి ఉన్నట్లు నిర్ధారించి ఆయనను అప్పటికప్పుడు వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన స్థానంలో పట్టాభిపురం సీఐగా వీరేంద్ర బాబు అటాచ్మెంట్ పై నియమితులై విధులు నిర్వహిస్తున్నారు. ఆ వివాదం సద్దుమణగక ముందే అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు కస్టడీ సమయంలో రాచమర్యాదలు కల్పించిన వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో పాటు వారి కుటుంబ సభ్యులను, మహిళలను చెప్పడానికి వీలులేని భాషలో దూషించి, అవమానకరంగా ప్రవర్తించడమే గాక అధికారాన్ని అడ్డుపెట్టుకొని వ్యవస్థలను బ్లాక్మెయిల్ చేసి బెదిరింపులకు దిగిన బోరుగడ్డ అనిల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోగా పోలీస్ కస్టడీలో ఆయనకు పోలీస్‌స్టేషన్లో రాచమర్యాదలు కల్పించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. కూటమి నేతలు, కార్యకర్తలే గాక సామాన్యులు సైతం దీనిని జీర్ణించుకోలేకపోయారు.

ఈ వ్యవహారంలో అప్పటి అరండల్ పేట సీఐ కొంకా శ్రీనివాసరావును వీఆర్‌కు పంపగా మరో నలుగురు కానిస్టేబుల్స్‌పై సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఆయన స్థానంలో అరండల్ పేట సీఐగా వీరాస్వామి అటాచ్మెంట్ పై నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన సీఐగా కొనసాగుతున్నారు. ఈ వివాదం ఇప్పుడిప్పుడే సమసిపోతున్న సమయంలో నగరంపాలెం సీఐ వీర నాయక్ మరో వివాదంలో చిక్కుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగి ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాలలో అడ్మిషన్‌లు కల్పిస్తామని విద్యార్థులను, నిరుద్యోగులను నమ్మించి కోట్లు వసూలు చేసిన నిందితుడిని అరెస్టు చేసిన సమయంలో నగరంపాలెం సీఐ వీర నాయక్ నిందితుని వద్ద లబ్ధి పొందారో ఏమో కానీ అక్కడ పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవికి సంబంధం లేకపోయినా ఆమె పేరును దుర్వినియోగం చేశారు. ఆ కేసులో నిందితుడికి ఎమ్మెల్యే వత్తాసు పలికినట్లు సీఐ కొందరు వద్ద నోరు జారడంతో ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి చేరింది దీంతో ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని హోం మంత్రికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే పేరును వాడుకోవడం పట్ల హోం మంత్రి సైతం సీరియస్‌గా స్పందించారు. దీంతో వీరనాయక్‌ను కొంత ఆలస్యంగా వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు ఇచ్చారు. ఆస్థానంలో ప్రస్తుతం పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న నజీర్ బేగ్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ విధంగా గడిచిన నాలుగు నెలల్లో వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్లలో సీఐలు నెల రోజుల్లోనే వీఆర్‌కు వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. కేవలం స్వయంకృతాపరాధం వల్లే అర్థాంతరంగా క్రమశిక్షణ చర్యలకు గురయ్యారు. తమకు రాజకీయపరమైన అండదండలు ఉన్నాయనో, ఉన్నతాధికారుల ఆశీస్సులు ఉన్నాయనో అతిగా ఊహించుకుని చట్ట విరుద్ధంగా వ్యవహరించినా, బాధితులకు అన్యాయం చేసినా కూటమి ప్రభుత్వంలో చర్యలు తప్పవని వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో చోటు చేసుకున్న ముగ్గురు సీఐలపై వేటు వ్యవహారాలే నిదర్శనంగా నిలిచాయి. ఇదే సమయంలో బోరుగడ్డ అనిల్‌కు పోలీస్ స్టేషన్లో రాచమర్యాదలకు సంబంధించిన విషయంలో వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్‌కు కూడా మరక అంటింది. ఆయనపై కూడా ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై విచారణ జరగడం నివేదికను డీజీపీకి పంపడం వంటి పరిణామాలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వెస్ట్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు ఈ దఫా కలసి రాలేదనే ప్రచారం జరుగుతోంది. గతంలో ఎప్పుడూ ఒక సబ్ డివిజన్‌లో డీఎస్పీ సహా మిగిలిన ఎస్‌హెచ్‌ఓలు అందరూ మూల్యం చెల్లించుకున్న ఉదంతాలు ఇటీవలి కాలంలో లేవనే చెప్పాలి.

సహనానికి పరీక్షగా ఎస్పీ గ్రీవెన్స్

మధ్యాహ్నం వరకు బాధితుల పడిగాపులు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో ప్రజల సమస్యలకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి ఉదయం 10 గంటల నుంచి బాధితుల రాక ప్రారంభమైంది. కార్యాలయంలో సంబంధిత సిబ్బంది అర్జీలను స్వీకరించారు. అయితే ఆయా అర్జీలను పరిశీలించాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడంతో మధ్యాహ్నం సుమారు ఒంటిగంట వరకు బాధితులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. మూడు గంటల పాటు పోలీస్ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీస్ స్టేషన్లకు రిఫర్ చేయాల్సిన అధికారులు ఎవరూ లేకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఇబ్బంది పడ్డారు. అయితే జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. వాస్తవానికి ప్రతి సోమవారం పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం మధ్యాహ్నం తర్వాత గాని లేదంటే మరో రోజు గానీ ఏర్పాటు చేసినట్లయితే తమకు ఇబ్బందులు తప్పేవని బాధితులు వాపో యారు. ఎస్పీ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా ఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులు నిర్వహిస్తే ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు వస్తున్నాయి, పోలీస్ స్టేషన్లో ఏం జరుగుతుందనే దానిపై కొంత అవగాహన ఉండడమే కాకుండా ఆయా ఫిర్యాదులపై పోలీస్ స్టేషన్లలోనూ సంబంధిత అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేసే అవకాశాలు ఉంటాయని వారు అంటున్నారు.



పోలీస్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఎదురుచూస్తున్న బాధితులు

వీవీఐటీలో క్రమశిక్షణతో కూడిన విద్య



వీవీఐటీలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీవీఐటీ కళాశాల 17వ వార్షిక వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తాము కళాశాలలో గడిపిన ఆనంద క్షణాలను, మధురానుభూతులను పంచుకోవటమేగాక ప్రస్తుత విద్యార్థులకు విద్యానంతరం విషయాలు, ఉద్యోగ కల్పనకు కావాల్సిన అంశాలను వివరించారు. అనంతరం వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి 2023-24 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ ఏడాది మెరుగైన ఉత్తీర్ణతా శాతాన్ని సాధించిన విభాగం కంప్యూటర్సైన్స్ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్(సి.ఎస్.ఎమ్) అకడమిక్స్ టాపర్‌గా, విద్యాయేతర (క్రీడ, సాంస్కృతిక) అంశాలనందు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విభాగం కంప్యూటర్ సైన్స్- ఐ.ఓ.టి అండ్ సైబర్ సెక్యూరిటీ విత్ బ్లాక్చైన్ టెక్నాలజీ (సి.ఐ.సి) రోలింగ్ షీల్డ్‌లను దక్కించుకున్నాయి. ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ వీవీఐటీ సంపూర్ణ క్రమశిక్షణ - సంపూర్ణ విద్య నినాదముతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తుందని తెలిపారు. వేడుకలలో విభిన్న సంప్రదాయాల వస్త్రధారణతో విద్యార్థులు ప్రదర్శించిన ' సంప్రదాయ నడక' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల అధ్యాపకులచే అవినీతికి దూరంగా ఉండాలన్న ఉన్నత లక్ష్యం దగ్గరలో ఉందా? సుదూరంలో ఉందా? అంటూ ప్రదర్శించిన 'పెండింగ్ ఫైల్' నాటకం విద్యార్థులను ఆలోచింపజేసేలా సాగింది. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎస్.కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 576.20 అడుగులు ఉంది. ఇది 272.17 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6022 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30114 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 46,980 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 21,637 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

- అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- పులిపాడులో హెలిప్యాడ్ స్థల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గురజాలటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనవరి 1వ తేదీన నిర్వహించనున్న మండలంలోని పులిపాడు పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. సోమవారం పులిపాడు గ్రామంలో ఆయన పర్యటించి సీఎం చంద్రబాబు హెలిప్యాడ్ ల్యాండింగ్‌కు గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని అనువైన ప్రాంతాన్ని గుర్తించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ అధికారులు కమిటీలుగా ఏర్పడి కార్యక్రమానికి విచ్చేసే ప్రజలకు మంచినీరు, స్నాక్స్ అందేలా చూడాలన్నారు. సీఎం చంద్రబాబు గ్రామానికి వచ్చేసరికి 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తవ్వాలన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్‌లను సీఎం చంద్రబాబు అందిస్తారని చెప్పారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌లపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్ట్ ఛైర్మన్ పులుకూరి కాంతారావు, జేసీ సూరజ్ గనోరే, జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ నగేష్, సీఐ భాస్కర్, ఎస్ఐ వినోద్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, మద్దినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనవరి నుంచి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం

- సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలకే నిధులు
- భవన నిర్మాణాలకు 15 రోజుల్లోనే అనుమతులు
- పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ

పెదకాకాని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.62 వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామనీ, అందులో తొలివిడతగా వచ్చే సుమారు రూ.47 వేల కోట్లతో జనవరి నుంచి పనులు చేపట్టడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైక్ మెన్ ఆడిటోరియంలో జరిగిన మున్సిపల్ కమిషనర్ల, ఇంజినీర్ల రాష్ట్ర వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేకపోవడం వలన అభివృద్ధి పనుల్లో జాప్యం ఏర్పడుతుందన్నారు. సీఎఫ్ఎంఎస్‌కి గత ప్రభుత్వం ప్రజల సొమ్ము సుమారు రూ.3200 కోట్లు తరలించిందన్నారు. వచ్చే ఏప్రిల్ 1 నుంచి సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు తమ నిధులను తామే అభివృద్ధి పనులకు ఖర్చు చేసుకునేలా ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చారని తెలిపారు. కమిషనర్లు రానున్న 3 ఏళ్లలో ప్రజలకు తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైన్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వర్షం నీటి నిర్వహణపై డీపీఆర్‌ను 20 రోజుల్లో అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. రాష్ట్రంలోని 28 లక్షల స్వయం సహాయక సభ్యుల ఆదాయాలను రానున్న కాలంలో రెట్టింపు చేయడానికి ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారని, అందుకోసమే గతంలో ఎన్నడూ లేనివిధంగా మెప్మా విభాగానికి ఐఏఎస్ అధికారిని నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలో జనవరి నుంచి సింగిల్ విండో ద్వారా 15 రోజుల్లోనే భవన అనుమతులు జారీ జరుగుతుందన్నారు. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే ఇంజినీర్ లైసెన్స్ రద్దుతోపాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు వేగంగా చేపట్టడం ద్వారా త్వరలోనే రాష్ట్ర మున్సిపాలిటీలను దేశంలోనే అత్యుత్తమ మునిసిపాలిటీలుగా తీర్చిదిద్దుకుందామన్నారు. పురపాలక శాఖ కార్యదర్శి కె.కన్నబాబు మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్లు, డ్రైయినేజీ, వీధి దీపాలు, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్క్‌షాప్‌లో మెప్మా ఎండీ, సీడీఎంఏ(ఇంచార్జి) ఎన్.తేజ్ భరత్, విశాఖపట్నం కమిషనర్ సంపత్ కుమార్, గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు, కాకినాడ కమిషనర్ భావన, ఈఎన్సీ డి.మరియన్న, రాష్ట్రంలోని కార్పొరేషన్ల, మున్సిపాలిటీల కమిషనర్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ జీవోనూ.. పట్టించుకోవడం లేదు

(5వ పేజీ తరువాయి)

ఆ భారాన్ని మోయాల్సి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో పండుగల సీజన్ నడుస్తోంది. క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా వాహన విక్రేతలు డిస్కౌంట్లు, రాయితీలు ప్రకటిస్తారు. అలాంటి సమయంలో వినియోగదారులు వాహనాలు కొనేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటి సమయంలో కూడా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందకపోవడంతో వినియోగదారులు తిరుగుముఖం పడుతున్నారు.

వినియోగదారులకూ రాయితీ..

తాజా పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం 12 శాతంగా వున్న రోడ్ ట్యాక్స్‌ను మినహాయించింది. దాంతో పాటు వాహనం ఖరీదులో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. తద్వారా లక్షకు రూ. 5వేలు చొప్పున వినియోగదారుడికి కలిసి వస్తుంది. లక్ష రూపాయల లోపు ఉన్న ఈ- ద్విచక్ర వాహనాలకు, రూ. 2 లక్షల లోపు ధర ఉన్న ఈ- 3 వీలర్స్‌కు, ఐదు లక్షలలోపు ధర ఉన్న సరుకు ఈ- రవాణా వాహనాలకు, రూ. 8 లక్షల లోపు ధర ఉన్న ఈ- ట్రాక్టర్లు, రూ. 2 కోట్ల లోపు ధర ఉన్న ఈ- బస్సులకు ఈ రాయితీ లభిస్తుంది. దాంతో పాటు స్క్రాప్ సర్టిఫికెట్ ఇస్తే వినియోగదారుడికి మరో 10 శాతం రాయితీ లభిస్తుంది. జీవో అమలులోకి రాకపోవడంతో వినియోగదారుడు ఆ రాయితీలన్నీ కోల్పోవాల్సి వస్తోంది. దీనిపై రవాణా శాఖ అధికారులను వివరణ కోరగా జీవో ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం వారు జారీ చేసిందని, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో జారీ చేసిన తరువాతే అది అమలులోకి వస్తుందని చెబుతున్నారు. జీవో గడువు ముగిసినరోజు అర్ధరాత్రి 12 గంటల నుంచే రోడ్ టాక్సును అమలులోకి తెస్తున్న రవాణా శాఖ, జీవో వచ్చి 15 రోజులు పూర్తయినా ఇప్పటికీ దాన్ని అమలు చేయకపోవడంపై వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై అభిప్రాయ సేకరణ

- ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా రాక
- 30న జిల్లా అధికారులతో సమావేశం
- కుల సంఘాల నుంచి వినతుల స్వీకరణ



గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ (షెడ్యూల్డ్ కులాల) ఉప వర్గీకరణపై వివిధ వర్గాల అభిప్రాయాన్ని సేకరించేందుకు ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ నెల 30న ఉదయం 10 గంటలకు జిల్లాకు చేరుకొని వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం అవుతారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్సీ సంఘాల నాయకుల నుంచి ఉప వర్గీకరణపై అభిప్రాయాలు, వినతిపత్రాలను స్వీకరిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం విజయవాడ వెళ్తారు. ఇక్కడ వినతిపత్రాలు ఇవ్వలేకపోయినా ప్రజలు ఈమెయిల్ ద్వారా కూడా పంపే అవకాశం కల్పించారు. అలానే విజయవాడలో ఉన్న కార్యాలయంలోనూ అందజేయవచ్చు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి. అలానే సుప్రీంకోర్టు కూడా ఎలాంటి నిలుపుదల ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై విచారణ జరిపి నివేదిక సమర్పించేందుకు రిటైర్డు ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాని నియమించింది. గత నెల 15న దీనికి సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడి కార్యాలయం మొదటి అంతస్తులో కమిషన్ ఆఫీసు కూడా ఏర్పాటు చేశారు. కమిషన్ ఇప్పటికే రాతపూర్వక వినతులను స్వీకరిస్తుంది. జనవరి 9వ తేదీ సాయంత్రం వరకు అర్జీలను వ్యక్తిగతంగా, రిజిష్టర్ పోస్టు ద్వారా పంపే అవకాశం కల్పించారు. అర్జీలను కమిషన్ మెయిల్ ఐడీ omcscscubclassification@gmail.com కూడా పంపవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు.

మా స్థలాన్ని కబ్జా చేశారు

- వైసీపీ నేత ప్రేమ్ కుమార్ ఆగడాలపై మరో ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెడలో టీడీపీ కండువా కప్పుకొని గ్రామీణ ప్రాంత రోడ్లలో వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేస్తూ రీల్స్ చేసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న కేసులో కర్నూలు పోలీసులు అరెస్టు చేసిన వైసీపీ నాయకుడు కొరిటిపాటి ప్రేమ కుమార్ ఆగడాలపై సోమవారం ఎస్పీకి మరో ఫిర్యాదు అందింది. చిన్ని ట్రావెల్స్ నిర్వాహకుడు ఖరీదు నాగ కుమార్ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2018 నుంచి ఏఈఎల్‌సీ అధ్యక్షుడు బెనర్జీ, ట్రెజరర్ రాజరత్నం నుంచి రమేష్ హాస్పటల్ పక్కన ఉన్న హైయర్ హాల్ కాంపౌండ్‌లో 1450 చదరపు గజాల స్థలాన్ని తన భార్య సుమ పేరుతో లీజుకు తీసుకొని అందులో చిన్ని ట్రావెల్స్ కార్యాలయాన్ని, అదేవిధంగా ఆయా వాహనాలకు పార్కింగ్ గా ఉపయోగించుకుంటున్నామని నాగ కుమార్ పేర్కొన్నారు. అయితే కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని తనను, తన భార్యను బెదిరించి దౌర్జన్యంగా స్థలాన్ని కబ్జా చేసి అందులో రేకుల షెడ్డు వేశాడన్నారు. అందులో ప్రేమ్ కుమార్‌తోపాటు ఆయన అనుచరులు గంజాయి, మద్యం, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో తమను తీవ్రంగా ఇబ్బందులు పెట్టారనీ, ఎన్నిసార్లు జిల్లా ఎస్పీ కార్యాలయంలో, నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

కారు ఢీకొని అన్నదమ్ములు మృతి

వినుకొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పసుపులేరు బ్రిడ్జి వద్ద ప్రతాపుల గురవయ్య (55) మృతి చెందగా, ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న గురవయ్య తమ్ముడు భీమరాజు(52) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురవయ్య, భీమరాజు అన్నదమ్ములు. ఇద్దరూ వినుకొండ మున్సిపాల్టీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పసుపులేరు బ్రిడ్జి వద్ద వాగు వెంబడి ఉన్న జీవాలను(పందులు) చూసుకునేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి ద్విచక్రవాహనంపై వినుకొండకు బయలుదేరుతుండగా, వేగంగా వచ్చిన కారు బ్రిడ్జి వద్ద వీరిని ఢీకొట్టింది. ప్రతాపుల గురవయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తమ్ముడు భీమరాజు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురవయ్యకు భార్య సాంబ, నలుగురు కుమార్తెలు ఉండగా ముగ్గురికి వివాహం జరిపించారు. భీమరాజుకు ఐదుగురు సంతానంలో నలుగురు కుమారులు, ఒక కుమార్తె కలరు. సంతానంలో అందరికీ వివాహం జరిపించారు. మృతి చెందారనే సమాచారం మేరకు బంధువులు పెద్ద ఎత్తున వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శోభనబాబు తెలిపారు.

గిరిజనుల అభివృద్ధే కూటమి లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారు నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో జగన్‌రెడ్డి గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు, విద్య, వైద్యం వంటి కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మద్యం ఆదాయం పేరిట ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి రుణాలు తెచ్చినా అభివృద్ధి మాత్రం శూన్యం అన్నారు. వెనకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.350 కోట్లు ఇస్తే, గత వైసీపీ ప్రభుత్వం నిధులను దారి మళ్లించిందన్నారు. దీంతో వెనకబడిన జిల్లాలు మరింత వెనకబడ్డాయన్నారు. గిరిజన ప్రాంతాలను కూటమి ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయటం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. రాష్ట్రంలో ఏడు ఐటీడీఏల పరిధిలో 9031 గిరిజన గ్రామాలు ఉండగా వాటిలో 2162 పల్లెలకు ఇప్పటికీ రహదారి సదుపాయం లేదన్నారు. కూటమి ప్రభుత్వం గిరిపుత్రుల వైద్య సదుపాయం కోసం ఏజెన్సీలలో డోలి మోతకు స్వస్తి పలకడానికి కరడవలసలో కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98.107.118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

అన్నదాతంటే.. అలుసా

- జాతీయ రైతు దినోత్సవం మనోళ్ళకి గుర్తు లేదు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

దేశానికి రైతే వెన్నెముక.. అంటూ రాజకీయ పార్టీల నేతలు ఊదర గొడతారు. అయితే జాతీయ రైతు దినోత్సవాన్ని వారు విస్మరించడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి ఏటా డిసెంబరు 23ను రైతుల దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జాతీయ, ప్రపంచ దినోత్సవాలను నిర్వహించే నేతలకు రైతు దినోత్సవం గుర్తుకు రాకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా జాతీయ రైతు దినోత్సవాన్ని నేతలు నిర్వహించిన దాఖలాలు లేవంటే వారి పట్ల వారికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో వినూత్నంగా పంటలు పండిస్తున్న రైతులను గుర్తించి రైతు దినోత్సవం సందర్భంగా వారిని సత్కరిస్తే ఆదర్శ రైతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రోత్సాహం లేకపోవడం పట్ల రైతు వర్గం అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. ఒకరిద్దరు నాయకులు మాత్రం రైతులకు శుభాకాంక్షలు తెలుపడం గమనార్హం.

ఎస్‌వో-2 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తూ 55 సంవత్సరాలు వయసు ఉండి, పీజీడీసీఏ, డీసీఏ డిప్లొమా కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన వారు ఈనెల 31లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం smgrashikshaguntur.blogspot.com అనే వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఎల్‌టీ, ఎఫ్ఎన్‌వో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గుంటూరు మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్లు, ఎఫ్ఎన్‌వోలుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు 5, ఎఫ్ఎన్‌వో పోస్టులు 14 భర్తీ చేస్తున్నట్లు ఆమె వివరించారు. అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను జనవరి ఏడో తేదీలోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలకు ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని డీఎంహెచ్‌వో సూచించారు.

టీబీ కార్యాలయంలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

గుంటూరు మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా జాతీయ క్షయ నిర్మూలన పథకంలో జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో ఏడాది పాటు కాంట్రాక్ట్ విధానంలో పని చేసేందుకు పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాట్స్ ప్లస్ టీబీ-హెచ్ఐవీ సూపర్‌వైజర్ (ఒక పోస్టు), డ్రగ్ రెసిస్టెన్స్ సెంటర్ టీబీ స్టాటిస్టిక్స్ అసిస్టెంట్ (ఒక పోస్టు), ఫుల్‌టైమ్ అకౌంటెంట్ (ఒక పోస్టు), టీబీహెచ్‌వీ (రెండు పోస్టులు), జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ (ఒక పోస్టు)కు సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను జనవరి ఐదులోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిని సంప్రదించాలని సూచించారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు(విద్య),డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే సెకండరీగ్రేడ్, స్కూల్ అసిస్టెంట్స్ పదోన్నతుల కోసం ఈనెల 24న సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు ఉదయం 11 గంటలకు డీఈవో కార్యాలయంలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు. సీనియార్టీ జాబితాను deognt.blogspot.com అనే వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు తెలిపారు.

బజరంగ్ జూట్ మిల్లులో అక్రమాలపై పోరాడుతున్నందుకు హత్యాయత్నం

- ఎస్పీకి పిల్లి బాబురావు ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బజరంగ్ జూట్ మిల్లుకు సంబంధించిన స్థలాలను వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, ఆయన సోదరుడు మురళి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయంపై తాను పోరాడుతున్నందుకు తనపై హత్యాయత్నం జరిగిందని కార్మిక సంఘ నాయకుడు పిల్లి బాబురావు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. బజరంగ్ జూట్ మిల్లు లాభాల్లో 40 శాతం కార్మికులకు వాటా రావాల్సి ఉందన్నారు. దానికి సంబంధించి కోట్లాది రూపాయలు కార్మికులకు రావాల్సి ఉండగా, మిల్లులో 60 శాతం వాటాదారుగా ఉన్న లునాని ఆ మొత్తం చెల్లించలేదన్నారు. అంతేగాక చట్ట నిబంధనల ప్రకారం బజరంగ్ జూట్ మిల్ ఆస్తులను విక్రయించడానికి గాని, కొనుగోలు చేయడానికి కానీ ఎవరికీ హక్కు లేదన్నారు. అయినప్పటికీ 2009లో రెండున్నర ఎకరాలు, అలాగే 2015లో ఐదున్నర ఎకరాలను అంబటి సోదరులు అక్రమంగా నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. దీనిపై తాను హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసి పోరాటం చేస్తున్న నేపథ్యంలో తనను కేసు ఉపసంహరించుకోవాలని వైసీపీ నేతలు అంబటి బ్రదర్స్‌తోపాటు కొందరు టీడీపీ నాయకులు కూడా ఒత్తిడి తెచ్చారన్నారు. ఆ కేసు విషయంలో తాను వారి మాట వినకపోవడంతో ఈనెల మూడున తాను ఓవర్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళుతుండగా ఆటోలో వచ్చిన గుర్తుతెలియని దుండగులు తనను పైనుంచి కిందకు పడేయాలన్న ఉద్దేశంతో కాళ్లతో తన్నారన్నారు. దీంతో ఫుట్‌పాత్‌పై పడిపోవడంతో చేతి భుజం వద్ద విరిగిందన్నారు. బజరంగ్ జూట్ మిల్ అక్రమాలపైనా, హత్యాయత్నంపైనా కేసులు నమోదు చేయాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

గ్లోబల్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌తో ఒప్పందం

గుంటూరు మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఆస్పత్రిలో అందుబాటులో లేని వైద్య పరీక్షలను అతి తక్కువ రేట్లకే గ్లోబల్ డయాగ్నోస్టిక్స్ అండ్ మెడైకాన్ అనే సంస్థకు కాంట్రాక్టుకు ఇచ్చినట్లు సూపరిం టెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సోమవారం వెల్లడించారు. ఈ సంస్థకు సంబంధించిన రిక్విజిషన్ ఫారాలు అన్ని వార్డుల్లో, ఓపీ కౌంటర్లలో అందుబాట్లో ఉంచినట్లు ఆయన తెలి పారు. కొంత మంది దళారులు జీజీహెచ్ పేరు చెప్పుకొని బయట ల్యాబ్‌ల్లో ఎక్కువ రేట్లకు రక్తపరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో వీటి కట్టడికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్లోబల్ డయాగ్నొస్టిక్ మెడైకాన్ ల్యాబ్‌కు చెందిన ఐడీ కార్డు కలిగిన టెక్నీషియన్లు మాత్రమే రోగుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తారని డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. రోగులు బయట ల్యాబ్‌లకు రక్తపరీక్షలు ఇచ్చి రోగులు మోసపోవద్దని ఆయన సూచించారు.

చెవి, ముక్కు, గొంతు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ భయ్యా సుధీర్

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెరుగుతోన్న ఆధునీకరణతో శబ్ధ, వాయు కాలుష్యాల వల్ల చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన సమస్యలు కూడా ఎక్కువవుతున్నాయని ఈఎన్‌టీ నిపుణులు డాక్టర్ భయ్యా సుధీర్ ఆందోళన వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. అనంతరం డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ తరచుగా వచ్చే తలనొప్పి, చెవిపోటు, జలుబు, తుమ్ములు, గొంతు నొప్పులు లోపల నిగూడంగా ఉన్నా తీవ్ర వ్యాధులకు లక్షణాలు కావచ్చని తెలిపారు. వినికిడి సమస్యలున్నా, తరచూ ముక్కు, గొంతు సమస్యలు వస్తున్నా వెంటనే ఈఎన్‌టీ నిపుణులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆర్ రామచంద్రరావు, అంజిరెడ్డి, సత్యనారాయణ తదితరులున్నారు.

అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలి

● కాంగ్రెస్ నేతల డిమాండ్

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే లింగం శెట్టి ఈశ్వరరావు పలువురు నాయకులు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచమేధావి అయిన అంబేద్కర్‌పై హేళనగా వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లింగంశెట్టి మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటమేంటే భారతజాతిని అవమానించటమేనన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బిళ్ళా సునీల్, వాల్మీకి శ్రీనివాసరావు, పాలపాటి అనీల్, కేకే గుప్తా, జయపాల్ తదితరులున్నారు.

చండీఘర్ డిస్కం విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చండీఘర్ డిస్కం విద్యుత్ ప్రైవేటు కార్పొరేట్ సంస్థ అయిన ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్‌కు అమ్మటాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా నాయకులు దండా లక్ష్మీనారాయణ, వై.నేతాజీ బీ.లక్ష్మణరావు అన్నారు. సోమవారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పంజాబ్, హరియాణ రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతమైన చండీఘర్ విద్యుత్ సంస్థను ప్రైవేటీకరించడాన్ని సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈనెల 31 నాటికి చండీఘర్ డిస్కం ఆస్తులను ప్రైవేట్ కంపెనీలకు దారా దత్తం చేయడానికై బీజేపీ ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. దీనిని వ్యతిరేకిస్తూ ఈ నెల 25న స్థానిక మార్కెట్ సెంటర్లో జరిగే నిరసన కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీ.నాగరాజు, సీహెచ్ శ్రీనివాసరావు, జీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్ ఐజీపీ వెంకటరామిరెడ్డికి అభినందనలు

● సత్యా ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ సర్వీసెస్ కార్యాలయం సందర్శించిన ఐజీపీ



వెంకటరామిరెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్ ఐజీపీ పి.వెంకటరామిరెడ్డి సోమవారం బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న సత్యా ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ సర్వీసెస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఐజీపీ వెంకటరామిరెడ్డికి సత్యా ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ అధినేత, విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ ఆత్మీయ స్వాగతం పలికారు. శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలిపారు. 1996లో గుంటూరు రూరల్ సబ్ డివిజన్ డీఎస్పీగా వెంకటరామిరెడ్డి కొనసాగుతున్న సమయంలో తాను ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన అనుభవాలను కాళహస్తి సత్యనారాయణ గుర్తు చేశారు. ఈ సందర్భంగా పోలీసుశాఖలో వారిద్దరు కలిసి పనిచేసిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ విశ్రాంత పోలీసు అధికారులు సంఘం పనితీరు, సత్యా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ వివరాలను తెలుసుకున్నారు.

అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 155 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎంవో పోర్టల్‌లోని పిటీషన్లతో పాటు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంక రన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 155 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం గంగరాజు, లక్ష్మీకుమారి కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను గుణాత్మకంగా పరిశీలించి వారి సంతృప్తి స్థాయిని పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా ఎప్పటికప్పుడు దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శంకర్, పం చాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఎంహెచ్‌వో డా.విజయలక్ష్మి, డీఎస్‌వో కోమలి పద్మ, డీపీవో నాగసాయి కుమార్, డీసీవో వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో విద్యార్థిని ప్రసవించిన ఘటనపై విచారణ జరపాలి

గత రెండు రోజుల క్రితం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థిని ప్రసవించిన ఘటపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అర్జీ అందజేశారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నవ్యశ్రీ, జిల్లా కార్యదర్శి యశ్వంత్‌లు మాట్లాడుతూ మూడు నెలల క్రితం పట్టాభిపురంలో వసతి గృహంలో ఇద్దరు బాలికలు అదృశ్యం అయ్యారని, రెండు రోజుల తరువాత వారిని పట్టుకోవడం జరిగిందన్నారు. కానీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసు కోలేదని ఆరోపించారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారుల నిర్లక్ష్యంతో ఈ ఘటనలు పున రావృతమవుతున్నాయని ఆరోపించారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు జిల్లా కు వచ్చి ఐదేళ్లు అయినప్పటికి హస్టళ్లను తనిఖీ చేయలేదని ఆరోపించారు. తక్షణమే డీడీ మధుసూదనరావును విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అంద జేసిన వారిలో సాయి, జ్యోతిక, అజయ్ వెంకట్, దిలీప్, రాజు, పవన్, బాస్కర్ తదితరులు ఉన్నారు.

ఫ్లై ఓవర్‌ను నిర్మించాలి

చినకాకాని ఇండస్ట్రియల్ ఏరియాలో రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, దీనిని దృష్టిలో పెట్టుకుని గతంలో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డులో ఉన్న ఫ్లై ఓవర్‌ను నిర్మించాలని స్థానికులు అర్జీ అందజేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డు కారణంగా ఇండస్ట్రియల్‌కు వెళ్లే దారిని మూసివేశారని అన్నారు. దీంతో చిన కాకాని నుంచి నిడమర్రు పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాం తంలో ఫ్లైఓవర్‌ను నిర్మించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీ మార్కు. ఎం చిరంజీవి, నాగేశ్వరరావు, శివ తదితరులున్నారు.

నూతన వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలి

జాతీయ అగ్రికల్చర్ మిషన్ పేరుతో వ్యవసాయ మార్కెటింగ్ దెబ్బతీసే విధంగా కేంద్రం తీసుకోచ్చిన నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. అనంతరం రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తిలను కార్పొరేట్ పరం చేసేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. గతంలో ప్రవేశపెట్టిన నల్లచట్టాలను రద్దు చేసినట్టు చేసి దొడ్డిదారిన పేర్లు మార్చి అవే చట్టాల్ని ప్రవేశ పెడుతుందని అన్నారు. నూతన వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవా లని కలెక్టర్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతుసంఘ నాయకులు కొల్లి రంగా రెడ్డి, ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, పాశం రామారావు, జొన్న శివశంకర్, ఈమని అప్పారావు, జగ న్నాథం, కృష్ణ, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదరసాను పునరుద్ధరించాలి

స్థానిక లాలాపేటలో ఉన్న మదరసాను పునరుద్ధరించాలని ముస్లిం సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఇర్షాన్, కరీమ్, సైఫ్‌అలీ తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పురోగతిలోకి తీసుకురావాలి : కలెక్టర్



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగమించే విధంగా గృహనిర్మాణ అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమి షనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 డిమాండ్ సర్వేలో నమోదు చేసి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్షమ్ ద్వారా మంజూరు చేసిన తాగునీరు సర ఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, పోషణ్ వాటికల ఏర్పాటు పూర్తి చేసి వినియోగంలోకి తీసు కురావాలని సూచించారు. సచివాలయాల పరిధిలో గృహాల మ్యాపింగ్, ఎన్‌సీడీ సర్వే పూర్త య్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌పీసీఐ కింద బ్యాంకు అకౌంటుకు ఆధార్ కార్డు అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాదు, ఈఈ శంకర్, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్ బాబు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, భూగర్భ జలవనరులశాఖ డీడీ వందనం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయ లక్ష్మి, డీపీవో సాయికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాల అందజేత

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కారుణ్య ఉద్యోగం కింద ముగ్గురికి కలెక్టర్ నాగలక్ష్మి నియామకపత్రాలను అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాల్లో ఒకరికి పోలీసు, మరొకరికి ట్రెజరీ, ఇంకొకరికి ఇరిగేషన్ శాఖలో నియమించారు. కలెక్టర్ మాట్లాడుతూ కారుణ్య నియామకం పొందిన ఉద్యోగులు తక్షణమే వారికి కేటాయించిన డిపార్టుమెంట్లకు వెళ్లి డ్యూటీకి రిపోర్టు చేయాలన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబసభ్యులను కూడా చక్కగా చూసు కోవాలన్నారు. కార్యక్రమంలో జేసీ భార్గవతేజ, డీఆర్‌వో ఖాజావలి, ఏవో మోహన్‌రావు పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో విష్ణువర్ధన్ సేవలు అభినందనీయం

● అబ్దుల్ కలాం విశిష్ట సేవ పురస్కారం ప్రదానం



పాటిబండ్ల విష్ణువర్ధన్‌ని సత్కరిస్తున్న చిలుకూరి హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 23(ఆంధ్ర జ్యోతి): చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్టు వారి 14వ రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. అందులో పాటిబండ్ల సీతారావమ్మ హైస్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ సేవకు గుర్తింపుగా ఏపీజే అబ్దుల్ కలామ్ పేరున విశిష్ట సేవా పురస్కార్ వరించిందని పాఠశాల గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ, పాఠశాల అధ్యక్షులు దేవినేని మల్లికార్జునరావులు తెలిపారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు చివుకుల సాంబశివరావు, సెక్రటరీ పత్రి వేణుగోపాల్ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠ శాల కమిటీ వైస్ ప్రెసిడెంట్ సూర్యదేవర హనుమంతరావు, కమిటీ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి దశావతార కల్యాణ మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గోరంట్ల శ్రీవేంకటేశ్వ రస్వామి దేవస్థాన సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు దశావతార కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల అంజనేయులు తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు ఆళ్ల శివారెడ్డి, గజవెల్లి శివన్నారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగళరావునగర్ బాలికల ఉన్నత పాఠ శాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వీర్ల త్రివేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టర్ శామ్యూల్ రాజు క్రీస్తు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ.రమేష్, వైస్ చైర్మన్ జంగల్ యెహో షువ తదితరులు పాల్గొన్నారు.



వెంగళరావునగర్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉద్యోగాల పేరుతో మోసాలు

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల బలహీనతలను క్యాష్ చేసుకుంటున్న మోసగాళ్లు రోజు, రోజుకు పెరిగిపోతున్నారు. ఉద్యోగాలు ఇస్తామంటూ నిరుద్యోగులకు శఠగోపం పెడుతున్నారు. లక్షల్లో సమర్పించుకున్న తర్వాత మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఎస్పీ గ్రీవెన్స్‌కు వచ్చిన పలువురు బాధితులు పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.

ఎఫ్‌సీఐలో ఉద్యోగాలు ఇప్పిస్తామని 24 లక్షలతో మోసం

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)లో ఉద్యోగాలు ఇప్పిస్తామని తమ వద్ద రూ.24 లక్షలు తీసుకొని మోసం చేశారని ఇద్దరు బాధితులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. వెల్దుర్తి మండలం రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన పులగం మణికంఠరెడ్డి, అదేవిధంగా గతంలో మణికంఠకు ఐటీఐలో క్లాస్మేట్ అయిన పాత గుంటూరులోని బాలాజీ నగర్‌కి చెందిన అడపాల హరీష్‌లకు గుంటూరులోని ఐపీడీ కాలనీకి చెందిన కుర్రా శంకరరావు, కుంచాల దుర్గాప్రసాద్, కర్లపాలెంకు చెందిన షేక్ అబ్దుల్ కరీంలు పరిచయమయ్యారు. ఎఫ్‌సీఐలో ఉద్యోగాలు ఇప్పిస్తామని శంకరరావు, దుర్గాప్రసాద్, కరీంలు నమ్మించారు. ఇందుకుగాను ఒక్కొక్కరికి రూ.12 లక్షల చొప్పున రూ.24 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో మణికంఠరెడ్డి, హరీష్‌లు విడతల వారీగా చెరో రూ.12 లక్షలు ఇచ్చారు. రూ.24 లక్షలు తీసుకున్న నిందితులు ఉద్యోగం వచ్చిందంటూ నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లు ఇవ్వడమే కాకుండా వారిని ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ తీసుకువెళ్లారు. నెలరోజుల పాటు అక్కడ లాడ్జిలో ఉంచి, అక్కడ ఎఫ్‌సీఐకు సంబంధించి మజ్దూర్ కార్మిక సంఘం కార్యాలయానికి తీసుకువెళ్లి ఇదే ఎఫ్‌సీఐ కార్యాలయం అని చెప్పి త్వరలోనే మీకు మరో అపాయింట్‌మెంట్ ఆర్డర్ వస్తుందని నమ్మించారు. ఉద్యోగం వచ్చిందంటూ నమ్మిస్తూ ఒక నెల రూ.9,600 చొప్పున జీతం కూడా వారికి ఆన్‌లైన్లో పంపారు. ఆ తరువాత విచారించగా ఇది మోసమని తెలిసింది. దీంతో బాధితులు తమ డబ్బు తమకు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయగా ఇద్దరికి కలిపి విడతల వారీగా రూ.5 లక్షల వరకు ఇచ్చారు. మిగిలిన డబ్బులు అడుగుతుంటే అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేసి చివరకు బెదిరింపులకు దిగారు. దీంతో బాధితులు వారం రోజుల క్రితం పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమలాగే ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి సుమారు 80 మందిని ఈ విధంగా ఈ ముఠా మోసం చేసినట్లు బాధితులు వాపోయారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని మూడు లక్షలు..

తనకు, తన స్నేహితుడికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని బూడిద చరణ్ రూ.3 లక్షలు తీసుకొని మోసం చేశాడని మారుతీనగర్‌లోని ఆంజనేయ స్వామి గుడికి చెందిన పొట్లూరి వెంకటకృష్ణ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తానని రూ.12 లక్షలు..

నీకు వీసా ఇప్పించి దుబాయ్ తీసుకువెళ్లడమే కాకుండా అక్కడ ర్యాక్స్ తయారీకి సంబంధించిన తన వ్యాపారంలో నీకు భాగస్వామ్యం కల్పిస్తానని చెప్పి తన ఇల్లు తాకట్టు పెట్టించి రూ.12లక్షలు తీసుకుని మోసం చేసిన షంషేర్ ఖాన్‌పై బారాఇమామ్ పంజాకు చెందిన షేక్ ఇమ్రాన్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. నా తండ్రి హబీబుల్లాకు, పొన్నూరురోడ్‌లోని సాయిబాబా కాలనీకి చెందిన ఇబ్రహీంతో 35 సంవత్సరాలుగా పరిచయం ఉందన్నారు. ఈ క్రమంలో ఇబ్రహీం అల్లుడైన షేక్ షంషేర్ ఖాన్‌తో తనకు ఏడేళ్లుగా పరిచయం ఉందని బాధితులు పేర్కొన్నారు. షంషేర్ ఖాన్ దుబాయ్‌లో ఉంటూ రాక్స్ తయారీ వ్యాపారం చేస్తూ బాగా సంపాదించాడని, అందులో బాగా లాభాలు వస్తాయని నీకు కూడా వ్యాపారంలో భాగస్వామ్యం ఇస్తానని ఇందుకుగాను 15 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడన్నారు. దీంతో వారి మాటలు నమ్మడంతో షంషేర్ ఖాన్ తమ ఇంటిని బ్యాంకులో తనఖా పెట్టించి 14 లక్షలు ఇప్పించాడన్నారు. అందులో గత జనవరి నుంచి విడతల వారీగా 11 లక్షల 80 వేలు తీసుకున్నాడున్నారు. తనకు ఎటువంటి వీసా ఇప్పించలేదన్నారు. షంషేర్‌ఖాన్ త్వరలోనే తిరిగి దుబాయ్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడని ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు వాపోయాడు.

సేల్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మోసాలపై ఫిర్యాదు

సేల్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న పాత పట్టాభిపురంనకు చెందిన మోతుకూరి నాగ పద్మారావు ప్రజలను మోసం చేస్తున్నాడని బజాజ్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధి నాగళ్ళ సునీల్‌కుమార్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ అనేక మంది బాధితులకు తెలియకుండా వారికి సంబంధించిన ఆధార్ కార్డులు, ఇతర డాక్యుమెంట్లను సబ్మిట్ చేసి వారి పేరుతో లోన్ తీసుకుని, వారి నుంచి ఓటీపీ నెంబర్ తెలుసుకొని వాయిదాల పద్ధతిలో చెల్లించే విధంగా వివిధ గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకొని నాగ పద్మారావు మోసం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. బాధితులకు తెలియకుండా తప్పుడు పత్రాలు సమర్పించి మోసాలకు పాల్పడుతున్న నాగపద్మారావుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సునీల్‌కుమార్ ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో అంబేద్కర్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

● అంబేద్కర్ అధ్యయన కేంద్ర ఉద్యోగులు



లాడ్జి సెంటర్‌లో నిరసన తెలుపుతున్న అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉద్యోగులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ లో కూడా అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంను ఏర్పాటు చేయాలని అంబేద్కర్ అధ్య యన కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది, ఉద్యోగులు కోరారు. సోమవారం స్థానిక లాడ్జి సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన, అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సం దర్భంగా అధ్యయన కేంద్ర ఉద్యోగి పి.నరసింహారావు మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశాలను నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నా రు. దీంతో విద్యార్థుల భవిత అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా అధ్యాపక సహాయ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి జీతాలు అందడం లేదన్నారు. రాష్ట్రం పై తెలంగాణ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థుల నుంచి వసూలయ్యే ఫీజుల మొత్తం రూ 21 కోట్లను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. అంతేగాక కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి రూ.4వేల కోట్లను కేటాయిస్తుందని అన్నారు. ఈ నిధులను వారి వద్ద ఉంచుకుని మాకు జీతాలు, ప్రవేశాలు నిలిపివేసిందని అన్నారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం అవశ్య కతను గుర్తించి రాష్ట్రంలో దీనిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు అప్పారావు, ఎన్వీ శేషయ్య, జ్యోతి, కుమార్, భాస్కరరావు, శైలజ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో పనిచేయాలి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పార్టీ శ్రేణులకు సూచించారు. నియోజకవర్గంలో చేపట్టవ లసిన అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం ఆమె తన కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఎక్కడ అవసరమవుతాయో గుర్తించి రిపోర్టు రూపొందించు కోవాలని తెలిపారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కాలువలు శుభ్రపరచి, ఫాగింగ్ నిర్వహించేలా స్థానిక అధికారులను కోరాలన్నారు. వీధి దీపాలు, వీధి కుక్కల సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు పీఎంఏవై ద్వారా ఆర్థికసాయం చేస్తోందని, డివిజన్లలో ఉన్న ప్రజలకు పథకంపై అవగాహన కల్పించి సమీప సచివాలయాల్లో లబ్ధిదారులుగా వారి పేర్లు నమోదు చేయించాలని సూచించారు.

ఇస్తమాకు పూర్తి సహకారం అందిస్తాం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జనవరి 12, 13 తేదీల్లో నంబూరులో జరగబోయే ఇస్తమాకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. కార్యక్రమ ఏర్పాట్లపై ఇస్తమా ప్రాంగణంలో సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరగబోయే ఇస్తమాకు ఎటువంటి అంతరా యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇస్తమా ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. ఇస్తమాకు రాష్ట్రం నలుమూలల నుంచి సు మారు లక్ష మంది ముస్లింలు హాజరుకానున్నారని, వారికి ఎలాంటి అవాంతరాలు లేకుండా చూసే బాధ్యత తమ కూటమి ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఇస్తమాకు ముస్లింలు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌వో, ఆర్డీవో, డీఎస్పీ, తదితర అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



ఇస్తమా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

నాజ్ సెంటర్ గుంట గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విజయశ్రీ ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే నసీర్ సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు నగర ప్రజలకు క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగ సీజన్లో ప్రతి ఒక్కరికి ఆహ్లాదం కలిగించేందుకు పిల్లలు, పెద్దలకు ఆహ్లాదాన్ని అందించే ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ పోతురాజు సమత, శనక్కాయల రాజకుమారి, వనమా నరేంద్ర, పోతురాజు చంద్ర, కొనకళ్ళ సత్యం పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుంటే మీ వెన్నంటే నేనుంటా..

● యమధర్మరాజు వేషధారణలో వినూత్నంగా అవగాహన

● ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌ను అభినందించిన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించకుంటే మీవెంటే నేనుంటానం టూ యమధర్మరాజు వేషధారణలో ఉన్న వ్యక్తి వాహన చోదకులకు హెల్మెట్ ఆవశ్యకతను తెలియజెప్పేలా వినూత్న రీతిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్లో హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ సతీష్‌కుమార్ హాజరై తిలకించారు. హెల్మెట్ ధరించని వాహన చోదకులను ఆలోచింపచేసేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. హెల్మెట్ ధరించుకుంటే మరణం ఎప్పుడు మీ వెంటే ఉంటుందనే సందేశాన్ని వాహనదారులకు యమధర్మరాజు వేషధారణ ద్వారా తెలియజేశారు. ప్రజలు కూడా హెల్మెట్ ధరించడంపై అవగాహన కలిగి ఉండి, ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించాలని, తద్వారా ప్రమాదాలకు గురవకుండా తమను తాము రక్షించుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్రబాబు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గల సాంబశివరావుపేటలో సుమారు 45సంవత్సరాలు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. అనారోగ్యంతో చనిపోయి ఉండగా అక్కడ వారు కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొత్తపేట ఎస్ఐ డీ రమేష్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతుడి ఆచూకీ గురించి చుట్టు పక్కల వారిని విచారించినా మృతుడి ఆచూకీ లభించలేదు. మృతదేహాన్ని రుద్ర ట్రస్టు సా యంతో మార్చురీలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కొత్తపేట స్టేషన్‌కు 0863-2221815లో గానీ, సీఐ వీరయ్య చౌదరికి 86888 31320లో గానీ తెలియజేయాలని పోలీసులు కోరారు.

సినీ ప్రముఖులకు తెనాలి పాదరక్షలు !


వెంకటేశ్వరరావు ఏర్పాటు చేసుకున్న చెప్పుల దుకాణం


చెప్పులు తయారుచేస్తున్న వెంకటేశ్వరరావు

సినీ పరిశ్రమల్లో పవర్‌స్టార్‌గా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్‌కల్యాణ్ ధరించే చెప్పులు తెనాలి ప్రాంతంలో తయారు చేసినవే.. తెనాలికి చెందిన గుండపు వెంకటేశ్వరరావు పాదరక్షకలు తయారీలో నైపుణ్యం పొందారు. తాను నెర్చుకున్న వృత్తిలోనే రాణిస్తూ అభిమాన హీరోలకు మంచి మోడళ్లతో నాణ్యమైన పాదరక్షకలు ప్రత్యేకంగా తయారు చేసి వారికి అందజేసి ప్రశంసలు అందుకుంటున్నారు. తెనాలికి చెందిన పాదరక్షకుల తయారీదారుడు గుండపు వెంకటేశ్వరరావు సినీ హీరో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మనస్సుకు చేరువయ్యాడు.

- పలు సినిమాల్లో కథానాయకులకు తయారీ
- పాత్రలకు తగ్గట్టు ప్రత్యేక డిజైన్లు..
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మెచ్చిన చెప్పులు
- సినీ పరిశ్రమలో తెనాలి కీర్తిని చాటుతున్న గుండపు వెంకటేశ్వరరావు

తెనాలి రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తెనాలి గంగానమ్మపేటకు చెందిన గుండపు వెంకటేశ్వరరావు పాదరక్షకలు తయారుచేస్తూ జీవనం సాగించేవారు. రెండు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలోని పలువురు కథానాయకులకు, రాజకీయ నాయకులకు వారు మెచ్చేలా పాదరక్షకులను తీర్చిదిద్దుతూ సినీ పరిశ్రమలో పరిచయం ఏర్పరుచుకున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సినీ హీరో పవన్‌కల్యాణ్‌కు వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా చెప్పులని తీర్చిదిద్ది అందజేశారు. కొద్దికాలంగా పవన్‌కల్యాణ్ అవే పాదరక్షలను ధరిస్తూ తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. పవన్‌కల్యాణ్ తనకు చెప్పులు కుట్టిన వెంకటేశ్వరరావుని సన్మానించి, అతడికి రూ.లక్ష చెక్కును అందజేసి అభినందించారు. తరువాత వెంకటేశ్వరరావు పాదరక్షకలు తయారీలో సినీ పరిశ్రమలో వెలుగులోకి వచ్చారు.

సినీ పరిశ్రమతో పరిచయం..

గతంలో సినీ పరిశ్రమలోని ఐశ్వర్య కాస్ట్యూమ్స్ డిజైనర్ దగ్గర పాదరక్షలు తయారుచేసే పనిలో వెంకటేశ్వరరావు ఉన్నారు. ఆ క్రమంలో సుమారు 20 సినిమాలకు పనిచేసి కథానాయకుల పాత్రలకు తగ్గట్టు పాదరక్షలు తయారు చేసి ఇచ్చారు. మొదటగా నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన గౌతమీపుత్ర శాతకర్ణి సినిమాకి వెంకటేశ్వరరావు పనిచేశారు. అనంతరం సినీ పరిశ్రమలోని ప్రముఖ హీరోలైన చిరంజీవి, రామ్‌చరణ్, ప్రభాస్, అల్లు అర్జున్, దుల్కర్‌సల్మాన్, మంచు విష్ణు, సాయిదుర్గాతేజ్ పలువురు నటించిన పాత్రలకు ఆయన పాదరక్షలను తయారుచేసి అందజేశారు.

పవన్‌కల్యాణ్‌పై అభిమానంతో..

పవన్‌కల్యాణ్‌పై ఉన్న అభిమానంతో ఆయనకు చెప్పులు కుట్టడం వల్ల తనకు ఇంత గుర్తింపు వచ్చిందని తను తయారుచేసిన చెప్పులతో నడుస్తూ అసెంబ్లీకి, పార్టీ కార్యక్రమాలకు వెళ్తుంటే తనకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు. అంతేకాకుండా తనలోని నైపుణ్యాన్ని ప్రత్యేకంగా గుర్తించిన వ్యక్తి పవన్‌కల్యాణ్ అని చెప్పారు. తనకు ఇచ్చిన రూ.లక్షతో సొంతంగా షాపు పెట్టుకున్నానని తనను ఆదరించిన సినిమా పరిశ్రమకు రుణపడి ఉంటానని తెలిపారు.


చెప్పులు తయారు చేస్తున్న వెంకటేశ్వరరావు

పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకంగా..

“ కాటమరాయుడు సినిమాలో పవన్‌కల్యాణ్ ధరించిన చెప్పులు వెంకటేశ్వరరావు తయారు చేసినవే. ఆయన తయారుచేసిన పాదరక్షలు ఒక వైపు ఉబ్బెత్తుగా ఉండి, ఎంతో మెత్తగా, సున్నితంగా ఉండటంతో పవన్‌కల్యాణ్‌కి ఎంతో నచ్చాయి. దీంతో ఆయన వ్యక్తిగతంగానూ వెంకటేశ్వరరావు దగ్గరే పాదరక్షలను ప్రత్యేకంగా తయారు చేయించేవారు. అనంతరం పవన్‌కల్యాణ్, వెంకటేశ్వరరావు నైపుణ్యాన్ని మెచ్చి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆ నగదుతో వెంకటేశ్వరరావు తెనాలి పట్టణంలోని గంగానమ్మపేటలో 'రమణ ఫుట్‌వేర్' పేరుతో షాపు పెట్టుకుని మరో ఇద్దరికి జీవనోపాధి కల్పిస్తూ జీవనం సాగిస్తున్నారు. పలువురు అగ్రహీరోలకు సైతం చెప్పులు కుట్టి వారి మన్ననలు పొంది తెనాలి ప్రాంత ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేశారు. ”

ఆగని.. ఆటోల్లో దోపిడీలు



- ప్రయాణికులను హడలెత్తిస్తున్న ముఠాలు
- ఇటీవల నగరానికి చెందిన 10 మంది అరెస్ట్
- అయినా ఆగని నేరాలు
- పని చేయని సీసీ కెమెరాలు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులలా నటిస్తూ ఆటోలలో ఒంటరిగా ప్రయాణించే వారిని దోచుకుంటున్న ముఠాల కార్యకలాపాలు మళ్లీ గుంటూరు నగరంలో ఊపందుకున్నాయి. తెనాలి కేంద్రంగా పెద్ద ఎత్తున ఈ తరహా దోపిడీలకు పాల్పడిన గుంటూరు నగరానికి చెందిన పదిమంది ముఠా సభ్యులను ఇటీవల తెనాలి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా తెనాలి కేంద్రంగా పెద్ద ఎత్తున ఆటోలలో ప్రయాణికులను దోచుకుంది. అయితే ఆయా ముఠాల్లో ఉన్న వారంతా గుంటూరు నగరానికి చెందిన వారు కావడం గమనార్హం. అయితే ఆయా ముఠాల అరెస్టుతో ఈ తరహా నేరాలు ఆగిపోతాయని పోలీసులు భావించారు. అయితే తాజాగా అలాంటి సంఘటనలు మళ్లీ జరగడం స్థానికుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రివేళ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో ఎక్కిన ఇరువురు బీహారీలను దుండగులు నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో దారి మళ్లించి వారిపై దాడి చేసి సెల్ ఫోన్, నగదు అపహరించకుపోయారు. తాజాగా అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జి సెంటర్ వద్ద నరుకుళ్ళపాడు గ్రామానికి చెందిన ఆంజనేయ వరప్రసాద్ అనే వృద్ధుడి జేబులో నుంచి 23 వేలు కొట్టేశారు. ఈనెల 17న మధ్యాహ్నం ఆంజనేయ ప్రసాద్ నరుకుళ్ళపాడు వెళ్లేందుకు లాడ్జి సెంటర్లో ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో వెనుక ఇరువురు, డ్రైవర్ సీట్ పక్కన మరొకరు ఉన్నారు. దీంతో ఆంజనేయ వరప్రసాద్ వెనుక సీట్లో కూర్చున్నారు. అయితే ఆటో కొద్ది దూరం వెళ్ళగానే ముందుగా అక్కడ పోలీసులు తనిఖీలు చేస్తున్నారని, ముందు సీటులో ఉన్న వ్యక్తిని పథకం ప్రకారం వెనక్కు పంపాడు. ఆయనను మధ్యలోకి జరిపారు. ఆటోలో ఇరుకుగా ఉన్నట్లు మిగిలిన ముగ్గురు ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ హడావిడి చేసి ఆయన వెనుక జేబులో పెట్టుకున్న రూ.23 వేలను కొట్టేశారు. ఆటో కొద్దిదూరం వెళ్ళగానే పక్కన ఉన్న వ్యక్తి దిగాలని చెప్పి ఆంజనేయ ప్రసాద్‌ను దించారు. ఆయన అడుగు కిందకు పెట్టిన వెంటనే ఆటోలో నుంచి మిగిలిన వారు దిగకుండానే ఆటో దూసుకుపోయింది. ఆ తర్వాత ఆయన జేబులో చూసుకోగా 23వేలు మాయమయ్యాయి. ఇదే తరహాలో ఇటీవల నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ మరో ఘటన చోటుచేసు కుంది. రాత్రి గాని, పగలుగాని ఒంటరిగా ఆటోల్లో ఎక్కే ప్రయా ణికులను లక్ష్యంగా చేసుకొని ఆయా ముఠాలు ఈ విధం గా దోపిడీలకు పాల్పడుతున్నా యి ఈ నేపథ్యంలో ఒంటరిగా ఆటో ఎక్కే ప్రయాణి కులు జాగ్రత్త గా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉం ది. ఈ ముఠాల కార్యకలాపాలతో ప్రయాణీకులు ఆటోలు ఎక్కాలంటేనే హడలెత్తి పోతున్నారు.

అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

గుంటూరు పట్టణంలో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. నగరం నడిబొడ్డున నేరం జరిగినా కనీసం ఆనవాళ్లను గుర్తించే పరిస్థితిలో కూడా సీసీ కెమెరాలు లేవు. తెలుగుదేశం ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వంలో వాటిని పక్కన పడేయడంతో నగరం లో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆయా సీసీ కెమెరాలపై దృష్టి సారించి పనులు నిర్వహిస్తోంది. అదేవిధంగా అమరావ తి రోడ్డు నుంచి సుమారు కిలోమీటర్ పరిధిలో ఈ నేరం జరిగినప్పటికీ రోడ్డు పక్కన ఉన్న వ్యాపార, వాణిజ్య సముదాయాల్లోనూ సరైన సీసీ కెమెరాలు లేవని తెలుస్తోంది. ఆటో ఆనవాళ్ళను గుర్తించేందుకు అరండల్‌పేట క్రైం పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అయినప్పటికీ ఆటోను గుర్తించేందుకు పోలీసులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు మరోసారి సీసీ కెమెరాలపై దృష్టి సారించి సంబంధిత నేరానికి పాల్పడిన ఆటోను గుర్తించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా వ్యాపార సముదాయాల్లో మెయిన్ రోడ్లను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాల్సిన అవసరం కూడా ఉంది.

సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యం

- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు


అవార్డు గ్రహీతలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, కమిషనర్ ఢిల్లీరావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, మిద్దెతోట నిపుణుడు రఘోత్తమ రెడ్డి

వట్టిచెరుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మనం తినే ఆహారంలో ఉంటున్న రసాయనిక అవశేషాలు మన ఆరోగ్యాన్ని కొంత మేర దెబ్బతీస్తున్నాయని, రసాయనాలు లేని ఆహారాన్ని తినటమే అన్నింటికి పరిష్కారం అని రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు పంచాయతీ పరిధిలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతు నేస్తం, మిద్దె తోటల పురస్కారం - 2024 కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇంట్లో మొక్కలు పెంచుకొనే వారు చాలా వరకు రసాయనాలు ఉపయోగించకుండా చిన్న చిన్న మెళకువలు పాటిస్తూ చీడ, పీడలను నివారించుకుంటూ సేంద్రియ పద్ధతుల్లో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు పెంచు కోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఇంటి మొక్కలు పెంచుకొనే వారికి ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందించడానికి తన వంతు కృషి, పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. ఇంటి పంటలపై శ్రద్ధ పెరుగుతుందని, నగరంలో ఉన్న మిద్దె తోటలను సందర్శించి వారు వినియోగించే సేంద్రీయ ఎరువులు, వాడే విధానాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని ఢిల్లీ రావు అన్నారు. తొలుత మాజీ ప్రధాని స్వర్గీయ చౌదరి చరణ్‌సింగ్ జయంతిని అంతర్జాతీయ దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమని, చరణ్‌సింగ్ చిత్రపటానికి డీజీపీ సీహెచ్ తిరుమలరావు, కమిషనర్ ఢిల్లీరావు, వెంకటేశ్వరరావు, రఘోత్తమరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతు నేస్తం పురస్కారాలు 2024 అవార్డులను అందజేశారు. అవార్డు పొందిన వారు ఎంతో మందికి స్ఫూర్తిని కలిగించి ఇంటి పంటదారుల సంఖ్యను పెంచడంలో కృషి చేస్తారని తిరుమలరావు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలతో పాటు పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం జిల్లాకోర్టు ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతీ జగడం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారధి, రిటైర్డ్ జడ్జి ఎస్.జేసు రత్నకుమార్, పాస్టర్ రెవరెండ్ వై.యోహాన్ రాజు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అనురాధ, ట్రెజరర్ దేవదాసు, సీనియర్ న్యాయవాదులు యం.నాగేశ్వరరావు, డేవిడ్ లూదర్‌బాబు, సుభకర్, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.


సెమీ క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి

ఎస్సీ కార్పొరేషన్‌లో...

తాడేపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజమైన ప్రేమతత్వం కలిగిన వ్యక్తి జీసస్ అని కొనియాడారు. క్రిస్మస్ సందర్భంగా నిరుపేద కుటుంబాలకు చేతనైన సహాయం చేయాలని ఎదుటివారికి సహాయం చేసే మనస్సు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆమె అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కృష్ణవేణి, కూటమి నేతలు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

అవిశ్రాంత సాహితీ శ్రామికుడు.. లక్ష్మీనారాయణ

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అవిశ్రాంత సాహితీ శ్రామికుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం గర్వకారణమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ గత 40 ఏళ్ళగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాహిత్య రంగంలో అనేక పెడ ధోరణులు వ్యక్తమవుతూ కలుషితమవుతున్న నేపథ్యంలో, అభ్యుదయ సాహిత్యానికి గుర్తింపు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ ఇటీవల రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర అనే గ్రంథంలో అనేక విషయాలు వెల్లడించారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ మాట్లాడుతూ ఆయనకు దక్కిన అవార్డు అభ్యుదయ సాహిత్యానికి లభించిన గుర్తింపు అని అన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం మూలాలను పరిశీలిస్తే, పేదల సమస్యల పరిష్కారం, అభ్యుదయ భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్ళడమేనని అన్నారు. సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎన్.కాళిదాసు, సీఎస్సార్ ప్రసాద్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.


పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న పాపినేని శివశంకర్, కేఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు తదితరులు

క్రిస్మస్ సందడి





- నూతన శోభ సంతరించుకున్న చర్చిలు
- ఆకర్షణీయ రంగులతో వెలుగొందుతున్న స్టార్లు
- కిటకిటలాడుతున్న దుకాణాలు

గుంటూరు, ఫిరంగిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సందడి నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకునే క్రిస్మ స్ వేడుకలకు మరికొద్ది గంటల సమయం మాత్రమే ఉండడంతో క్రైస్తవ సోదరులు పండు గ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చీలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గుంటూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినాన్ని స్వాగతిస్తూ ఏర్పాటు చేసిన స్టార్లు ఆకర్షణీయంగా వెలుగొందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని దుకాణాలన్నీ కిటకిటలాడుతు న్నాయి. ముఖ్యంగా వస్త్ర దుకాణాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. గడిచిన రెండు రోజులుగా అన్ని దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి, ఆఫర్లతో భక్తులను ఆకట్టునేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. అదే విధం గా మిఠాయి దుకాణాల్లో కూడా సందడి నెలకొంది. నేటి అర్ధరాత్రి పూజలతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమవుతాయి.

ఫిరంగిపురంలో విస్తృత ఏర్పాట్లు

ఆంధ్రా రోమ్‌గా పిలిచే ఫిరంగిపురంలో ఈనెల 24, 25 తేదీల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరగను న్నాయి. రాష్ట్రంలోనే అతి పెద్ద దేవాలయంగా 1891లో లండన్ మిల్ హిల్‌కు చెందిన ఫాదర్ థియోడర్ డిక్మన్ స్వామి నిర్మించారు. 24వ తేదీ ఉదయం 5:30 గంటలకు రెవరెండ్ ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి ఆధ్వర్యంలో దివ్య పూజా బలి జరుగుతుంది. రాత్రి 11:30 గంటలకు క్రీస్తు జయంతి మహోత్సవ జాగరణ దివ్య పూజాబలిని గుంటూ రు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య నిర్వహిస్తారు. 25వ తేదీ ఉదయం 5:30 గంటలకు రెవరెండ్ ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి, 8 గం టలకు శ్రీకాకుళం డయాసిస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ తుమ్మా డోమ్నిక్, సాయంత్రం 5:30 గంటలకు కొండమెట్ల వద్ద దివ్య పూజా బలిని ఫాదర్ ఉప్పులూరి రవీంద్రలు నిర్వహిస్తారు. సాయం త్రం 7 గంటలకు వివిధ కాలనీలు, వివిధ గ్రామాల నుంచి తేర్లు ఊరేగింపు, 10 గంటలకు కొవ్వొత్తుల సమర్పణ, రాత్రి 9 గంటలకు బాణ సంచాతో, మేళ తాళాలతో తేరును గ్రామ పుర వీధుల్లో ప్రదక్షణలు చేయనున్నామని రెవరెండ్ ఫాదర్ మాలపాటి పాతి మా మర్రెడ్డి తెలిపారు.


ఫిరంగిపురంలో క్రిస్మస్ వేడుకలకు కాంతులీనుతున్న బాల ఏసు చర్చి



గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 164 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 64 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 50 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 79 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1410 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

587 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 23: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో నామమాత్రంగా 587 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, కాయ ఒకేధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,100, గరిష్ఠధర రూ.11,300, మోడల్‌ధర రూ.10,675 పలికాయి.

యానిమేటర్ ఎన్నిక వాయిదా

పెదనందిపాడు, డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలపర్రులో డ్వాక్రా యానిమేటర్ నియామక ఎన్నిక సోమవారం వాయిదా పడింది. ఎన్నిక నిర్వహణకు డ్వాక్రా సభ్యులు తరలిరాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు వాయిదా వేసినట్లు తెలిపారు. గతంలో యానిమేటర్‌గా పనిచేసిన అంజలిని తొలగించి ప్రజాప్రతినిధులు కొత్త వారిని నియమించారు. ఆ నియామకం చెల్లదని, తాను ఎలాంటి అవినీతి చేయలేదని తననే కొనసాగించాలంటూ అధికారులకు తెలపగా, ఇటీవల అధికారులు గ్రామంలో విచారణ చేసి, ఎన్నిక నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఎన్నిక వాయిదా వేయడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనాథలకు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న చలపతి విద్యార్థులు

తాడికొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్‌ఈ టెక్నో క్రాట్స్ అసోసియేషన్ విద్యార్థుల ఆధ్వర్యంలో వృద్ధులు, అనాథలకు ఆదివారం రాత్రి దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ చలికాలంలో గుంటూరులోని ప్రభుత్వాస్పత్రి, మార్కెట్ సెంటర్, శంకర్‌విలాస్, బస్‌స్టాండ్, ఫ్లైఓవర్లపై నిద్రిస్తున్న అనాథలు, వృద్ధులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 100 దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేసి నట్లు తెలిపారు. విద్యార్థులు సామాజిక దృక్పథం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఎస్‌ఈ విభాగాధిపతి జీ రామచంద్రరావు, సీఎస్‌ఈ అధ్యాపకులు పాల్గొన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడులు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని క్రిస్టియన్ పేటలో గుట్టుచప్పుడు కాకుండా ఓ నివాసంలో పేకాట ఆడుతున్న 8 మందిని తాడేపల్లి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి సీఐ కళ్యాణరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సుందరయ్యనగర్ బత్తుల రాజు భవనం వద్ద కార్మికులు నిరసన తెలిపి విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు బాజి, ప్రభాకర్, శివాజి పాల్గొన్నారు.

చిలకా వెంకటేశ్వరరావుకు నివాళి

మంగళగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బౌద్ధ అభిమాని చిలకా వెంకటేశ్వరరావు గత నెల 28న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ మంగళగిరి బుద్ధ విహార కార్యాలయంలో వివిధ ప్రజాసంఘాల సాహితీ కళావేదిక ప్రముఖులు సమావేశమై నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంగళగిరి బుద్ధ విహార వ్యవస్థాపకుడు రేఖా కృష్ణార్జునరావు మాట్లాడుతూ మంగళగిరి బుద్ధ విహార వ్యవస్థాపక బృందంలో ఒకరైన చిలకా వెంకటేశ్వరరావు మృతి తీరని లోటన్నారు. మంగళగిరి సాహిత కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ మానవతావాది చిలకా వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో మానవత వేదిక కన్వీనర్ గోలి మధు, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని గ్రామాల అభివృద్ధికి గ్రహణం

● శాఖల మధ్య సమన్వయ లోపం
● సీఆర్డీఏకి సహకరించని రెవెన్యూ, పంచాయతీలు



తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయం

తుళ్లూరు, డిసెంబరు 23(ఆంధ్రప్రదేశ్): రాజధాని అమరావతి నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వంలో 33 వేల ఎకరాలు ఇచ్చిన 29 రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడానికి సీఆర్డీఏ నిధులు కేటాయించి పనులు చేశారు. వైసీపీ ఐదేళ్ల ప్రభుత్వంలో అమరావతి అభివృద్ధిని జగన్‌రెడ్డి ఆమడదూరం పెట్టారు. తట్ట మట్టి వేసి ఒక్క గుంతను పూడ్చిందీ లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి చంద్రబాబు సీఎం అయిన తర్వాత రాజధాని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయటానికి సీఆర్డీఏ అధికారులు సన్నద్ధమయ్యారు. అందులో భాగంగానే రాజధాని గ్రామాల్లో తాగునీటి సమస్యను అధిగమించటానికి చర్యలు తీసుకున్నారు. 14 కోట్లను ఆయా గ్రామాల్లో మెరుగైన నీటి వసతులకు కేటాయించారు. సమస్యలున్న గ్రామాల్లో పనులకు అంచనాలు తయారు చేసి ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కాని వారి స్పందన నామమాత్రంగానే ఉంది. ఇలా అయితే రాజధాని గ్రామాల్లో అమరావతి స్మార్ట్ సిటీ కల ఎప్పటికి నెరవేరాలని సీఆర్డీఏ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల తీరు ఇలా ఉంటే.. రెవెన్యూ శాఖకు వచ్చే సరికి రైతులకు సమస్యలున్నాయని వాటిని పరిష్కరించాలని సీఆర్డీఏ అధికారులు చెపుతుంటే రెవెన్యూ శాఖ అధికారులు పెడ చెవిన పెడుతుండటం గమనార్హం. రాజధానికి భూములిచ్చిన రైతులకు రెవెన్యూపరంగా కొన్ని సమస్యలు (ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్ జారీ, సదరు భూమి అడంగల్‌లో చేర్చకపోవటం, పోయిన పట్టాదారు పాసు పుస్తకాల స్థానంలో కొత్తవి మంజూరు చేయటం, విస్తీర్ణం తగ్గితే దానిని కొలిచి అప్పజెప్పటం)వంటి తదితర సమస్యలున్నాయి. అవి పరిష్కారమైయితే రాజధానికి భూములిచ్చిన రైతుల సమస్యలు సీఆర్డీఏలో పరిష్కారమవుతాయి. రాజధాని గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో అంటీ అంటనట్టు రెవెన్యూ పంచాయతీ అధికారులున్నారని సీఆర్డీఏ అధికారులు ఆరోపిస్తున్నారు. రాజధాని 29 గ్రామాలకు గానూ తుళ్లూరు మండలంలోనే 18 గ్రామాలున్నాయి. 11 గ్రామాలు మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన ఉన్నాయి. పంచాయతీలు సీఆర్డీఏతో కలసి పనిచేయాలని తుళ్లూరు ఎంపీడీవో పలు మార్లు సమావేశాల్లో చెప్పినప్పటికీ గ్రామాల అభివృద్ధి పనుల విషయంలో పంచాయతీ రెవెన్యూ అధికారులు సరిగా స్పందించకపోవటంతో ముందుకు సాగటం లేదు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభిస్తున్న ఫాదర్ సహాయరాజు, ఆరోగ్యదాసు, సెబాస్టియన్

తాడేపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని గుడ్‌న్యూస్ హైస్కూల్లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలను ఆంధ్ర లయోలా కళాశాల కరస్పాండెంట్ సహాయరాజు ప్రారంభించి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ఘనంగా చేసుకునే పండుగ క్రిస్మస్ అన్నారు. సర్వ మానవాళి సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఫాదర్ ఆరోగ్యదాసు, సెబాస్టియన్ విన్సెంట్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ, సామరస్య విలువలు కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం 30మంది వృద్ధులకు దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాంతకుమారి, నాగేశ్వరరావు, రమేష్, సత్య మేరీ, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చీరెలు, దుప్పట్ల పంపిణీ

దుగ్గిరాల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలోని వెలివెల ఆది నారాయణమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు, వెలివెల కృష్ణారావు సౌజన్యంతో ఈమనిలోని చర్చిలో జరిగిన సెమిక్రిస్మస్ వేడుకల అనంతరం మహిళలకు చీరెలు, వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, కృష్ణదేవరాయ కళావేదిక వ్యవస్థాపకుడు, ప్రముఖ కవి గంగాశ్రీ, డాక్టర్ రమేష్‌బాబుల చేతుల మీదుగా దుప్పట్లు, చీరెలు పంపిణీ చేశారు. పాస్టర్ మోషే, తిరుమలశెట్టి కొండలరావు, నాగరాజు, సాగర్ పాల్గొన్నారు.

పెదనందిపాడు : మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చి వద్ద సెమీ క్రిస్మస్ నిర్వహించారు. చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం పాస్టర్లు క్రీస్తు పుట్టుక సందేశాన్ని భక్తులకు వివరించారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాలను సంఘ పెద్దలు పర్యవేక్షించారు.



ఈమనిలోని చర్చిలో మహిళలు, వృద్ధులకు దుప్పట్లు చీరల పంపిణీలో పాల్గొన్న శ్రీఅనిత, డాక్టర్ రంగిశెట్టి రమేష్‌బాబు

కాకుమాను: క్రీస్తు బోధనలు ఆచరించడం వల్ల సమాజంలో అశాంతి తొలిగి శాంతి నెలకొంటుందని మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు బి.సత్యం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్రిస్మస్ భారీ కేక్‌ను కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీపీ రాంగోపాల్ మాట్లాడుతూ గతంలో విద్యార్థులు వసతులు లేకపోయినా చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారని తెలిపారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవోలు కెన్నడీ, విజయభాస్కర్, పూర్వ విద్యార్థి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు: తోటి వారితో ప్రేమగా మెలగడమే ఏసు క్రీస్తు నుంచి వెలువడిన సందేశం అని తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మానవుల్లో ప్రేమ దయ, కరుణ ఉంటే ప్రభువు విశ్వాసం పొందుతారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయం నిర్వీర్యం

● మొక్కుబడిగా హాజరవుతున్న అధికారులు
● జిల్లా కార్యాలయాల బాటపడుతున్న అర్జీదారులు
● 25 శాఖలకు 10శాఖల అధికారులే హాజరు



ఉదయం 11గంటలకు హాజరైన ఐదుగురు అధికారులు

పెదనందిపాడు, డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం మండల స్థాయిలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమానికి కొంతమంది అధికారులు మొక్కుబడిగా హాజరై కొంతమంది డుమ్మా కొట్టడంతో కూటమి ప్రభుత్వ ఆశయం నిర్వీర్యమవుతోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తొలుత మండలంలోని అన్ని శాఖల అధికారులు ఉదయం 10గంటలకు హాజరై ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలి. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయా గ్రామాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటికి రశీదు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా కొన్ని శాఖల అధికారులు అలావచ్చి ఇలా వెళ్లారు. ఉదయం 11గంటలకు ముగ్గురు, 12 గంటల సమయానికి ఐదుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో ప్రజాసమస్యలు పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. కొన్ని వారాలుగా ఇదే తంతు కొనసాగుతుంది. దీంతో అర్జీదారులు చేసేదేమిలేక గుంటూరులోని జిల్లా కార్యాలయాల బాట పడుతున్నారు.

ఫిజియోథెరపి క్యాంపులను సద్వినియోగించుకోవాలి : ఎంఈవో

కాకుమాను, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక వనరుల కేంద్రంలో జరిగే ఫిజియోథెరపి క్యాంప్‌ను ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు సద్వినియోగించుకోవాలని ఎంఈవో కేఫ్ కెన్నడీ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ఫిజియోథెరపి క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాల బ్రహ్మచారి పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఎత్తు, బరువులను నమోదు చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు ప్రతిరోజు వ్యాయమం చేయించాలని సూచించారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో భవితకేంద్రం టీచర్ దయమ్మ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన భౌతికశాస్త్ర అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

తాడేపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ భౌతిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సదస్సులో నానో మెటీరియల్స్‌లో తాజా పరిణామాలను, ఇంధన నిల్వ వ్యవస్థల భవిష్యత్తును రూపొందించడంలో వాటి కీలక పాత్రను ప్రదర్శించినట్టు భౌతిక శాస్త్ర విభాగాధిపతి కే స్వప్న తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎస్ షణ్ముగన్, వీసీ సారధి వర్మ, ప్రోచాన్స్‌లర్ జగన్నాధరావు, ప్రోవీసీలు ప్రసాద్ వెంకటరామ్, కేఎల్ కాలేజ్ ఆఫ్ సైన్సెస్ కే సుబ్రహ్మణ్యం, మాధవ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో ప్రభుత్వ స్థలాల విక్రయాలు

● వైసీపీ హయాంలో జేబులు నింపుకున్న నాయకులు
● అక్రమ కట్టడాలు కూల్చివేసిన అధికారులు
● విక్రయించిన వారిపై కేసులు పెడుతున్న బాధితులు



ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం(ఫైల్)



లాంలో అక్రమంగా నిర్మించి కట్టడాలను కూల్చివేసిన దృశ్యం

తాడికొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి కన్పిస్తే పాగా వేయాల్సిందే అన్నట్లుగా వైసీపీ ప్రభుత్వంలో నాయకులు రెచ్చిపోయారు. ధనార్జనే ధ్యేయంగా ప్రజలను నమ్మించి ప్రభుత్వ స్థలాలు, కొండ పోరంబోకు స్థలాలు విక్రయించి జేబులు నింపుకున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ స్థలాలు విక్రయించారనే ఆందోళనలో కొనుగోలుదారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇస్తున్నారు. మండలంలోని లాం గ్రామంలో ప్రభుత్వ భూములకు బీ-ఫారాలు ఉన్నాయని నమ్మబలికి సామాన్య, మధ్యతర గతి ప్రజలకు విక్రయించి జేబులు నింపుకున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చిన ఏ ఒక్క అధికారి స్పందించకుడా వైసీపీ నాయకులకు వత్తాసు పలికారు. తూతూ మంత్రంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. స్థలాలు విక్రయించటమే కాకుండా, సదరు స్థలాలకు ఇంటి పన్నులు, విద్యుత్ సరఫరాను ఇప్పించటంలో కీలక పాత్ర వహించారు. గ్రామంలోని టీడీపీ నాయకులు కలెక్టర్ నుంచి తహసీల్దార్ వరకు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చిన బుట్టదాఖలయ్యాయి. చివరగా కోర్టును ఆశ్రయించగా.. ఆక్రమణలు కూల్చివే యాలని కోర్టు తీర్పు ఇచ్చి నా... అప్పటి అధికారులు ఆక్ర మణలపై, వైసీపీ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకో లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రభుత్వ స్థలాలు కబ్జాలు, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. అంతేకాకుండా టీడీపీ నాయకులు అధికారులపై కోర్టుల ను ఆశ్రయించటంతో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో అధికారులు పోలీసుల సమ క్షంలో నవంబరు 23వ తేదీన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. కొంత మంది కోర్టును ఆశ్రయించి ఇంటి నిర్మాణాలు కూల్చివేయకుండా స్టే తెచ్చుకున్నారు. అయితే ప్రభుత్వ స్థలాలు విక్రయించిన వారిపై తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు వస్తున్నాయి. కాగా స్థలాలు విక్ర యించిన వారు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ స్టాం పుల్లో తాడికొండ సబ్‌రిజిస్ట్రార్ స్టాంపులు వేశారు. అంతే కాకుండా అమ్మిన, కొనుగోలు చేసిన వ్యక్తుల ఫొటో లను అంటించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చేసినట్టే రిజి స్ట్రేషన్ చేయటం గమనార్హం. ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేసిన మోసపోయిన బాధితులు పెరిగే అవకాశం ఉన్నది. ఒక్కొక్కరిగా స్థలాలు కొనుగోలు చేసి మోసపోయిన బాధితులు బయటకు వస్తున్నారు.

నృసింహుడి సన్నిధిలో చినజీయర్ స్వామిజీ



మంగళగిరి దేవస్థానాన్ని సందర్శిస్తున్న త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామిజీ

మంగళగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి సోమవారం మంగళాద్రి క్షేత్రాన్ని సందర్శించారు. ఆయన తన శిష్య బృందంతో కలిసి దిగువ ఎగువ సన్నిధుల్లో ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీపానకాల నృసింహస్వామిని దర్శించారు. తొలుత దిగువ సన్నిధి రాజగోపురం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపరెడ్డి రామకోటిరెడ్డి ఆలయ అర్చకులతో కలిసి జీయర్‌స్వామికి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ధ్వజస్తంభానికి మొక్కి శ్రీలక్ష్మీ నృసింహస్వామివారిని, శ్రీరాజ్యలక్ష్మి అమ్మవార్లను పూజించారు. ఆ తరువాత ఎగువ సన్నిధికి వెళ్లి శ్రీపానకాల నృసింహస్వామిని అర్చించారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని బాహుజీ విద్యాలయ ఆవరణలో ఈనెల 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఉత్సవాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్న జీయర్ స్వామిజీ సోమవారం ఉదయం మంగళాద్రి క్షేత్రాన్ని సందర్శించారు. స్వామిజీ వెంట యర్రాకుల తులసీరామ్ యాదవ్ కూడా పాల్గొన్నారు.

రాజధానిలో నేడు కేంద్ర సహాయ మంత్రి పర్యటన

తుళ్లూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రాజధాని అమరావతిలో మంగళవారం ఉదయం పర్యటించనున్నారు. పది గంటలకు వెంకటపాలెం గ్రామానికి దగ్గర్లో ఉన్న వెస్ట్ బైపాస్ టోల్‌గేట్ దగ్గర నుంచి సీడ్ యాక్సెస్‌రోడ్డు వరకు జరుగుతున్న వెస్ట్ బైపాస్‌తో రాజధాని రోడ్లు అనుసంధానమయ్యే ప్రాంతాలను పరిశీలించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కార్యాలయం ఒక ప్రకటనలో సోమవారం తెలిపింది. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ గుంటూరు ఎంపీ కేంద్ర మంత్రి పాల్గొనే ఈ కార్యక్రమంలో రైతులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆ ప్రకటనలో కోరింది.

సైబర్ నేరాలపై అవగాహనతో మెలగాలి

మంగళగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణకార వ్యాపారులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి మోసపోకుండా అప్రమత్తంగా మెలగాలని ఎంఎస్ఎంఈ క్లస్టర్ మేనేజరు రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక బైపాస్ రోడ్డులోని ధనలక్ష్మి గోల్డ్ క్లస్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అధ్వర్యంలో స్వర్ణకార వృత్తిదారుల కు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకు ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా, ఫేక్ ఫోన్‌కాల్స్, వాట్సప్ లింకులతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగిస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఆయన వివరించారు. ఇటీవలి కాలంలో వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేసి ఆర్థిక నష్టాలను కలిగించడం వంటి ఘటనలు చాలా ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో రోజూ వాడే మొబైల్స్, లాప్‌టాప్‌ల ద్వారా మన డేటాను హ్యాక్ చేసి పలురకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారని రాజ్‌కుమార్ వివరించారు. ఈ తరహా సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటానికి డయేషన్ ఫౌండేషన్ గూగుల్ సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పారేపల్లి మహేష్ తెలిపారు. కార్యక్రమంలో డీ శ్రీనివాస్, డైరెక్టర్ రామారావు పాల్గొన్నారు.

ఉప్పుటూరి చినరాములు సేవాట్రస్టు ఆధ్వర్యంలో

పేదలకు క్రిస్మస్ కిట్ల పంపిణీ



మహిళలకు క్రిస్మస్ కిట్స్ అందజేస్తున్న ఉప్పుటూరి చిన రాములు

వట్టిచెరుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వట్టిచెరుకూరు మండల మాజీ జడ్పీటీసీ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి దాతృత్వం, పేదలకు అన్ని విధాలుగా ఆర్థికపరంగా సాయాన్ని అందించే పరంపరను ఆమె భర్త చిన రాములు ద్వారా వారి కుమారుడు ఎన్‌ఆర్‌ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి కొనసాగిస్తూనే ఉన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని తన తల్లి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం సోమవారం రాత్రి తన తండ్రి ఉప్పుటూరి చిన రాములు సేవా ట్రస్ట్ ద్వారా పుల్లడిగుంట గ్రామంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ వద్ద గ్రామంలోని ఎస్సీ కుటుంబాలకు బాసుమతి రైస్, పంచదార, నూనె తదితర వస్తువులతో కూడిన కిట్స్‌ను రాములు పంపిణీ చేశారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గణిత విభాగాధిపతి అప్పారావు

తాడేపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను కేఎల్ గణిత విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత విభాగాధిపతి డాక్టర్ బీ అప్పారావు మాట్లాడుతూ సున్నాను కనిపెట్టి భారతీయులు ప్రపంచ గణిత శాస్త్రానికి అద్భుత కానుక ఇచ్చారన్నారు. దశాంశ పద్ధతిని గుర్తించింది కూడా భారతీయులే కావడం విశేషమన్నారు. గణిత శాస్త్రానికి దిశానిర్దేశం చేసిన శాస్త్రవేత్తల్లో ప్రథమంగా ఆర్యభట్ట, మహావీర, బ్రహ్మగుప్త, శ్రీనివాస రామానుజన్ వంటి వారు ఉన్నారన్నారు. కార్యక్రమంలో వీసీ సారధి వర్మ, ప్రోవీసీ ఏవీఎస్ ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి కేఆర్ఎస్ ప్రసాద్, గణిత విభాగాధిపతి టీవీ అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రైతు వ్యతిరేక చట్టాలు చేసేందుకు కేంద్రం యత్నం: ములకా

తెనాలి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలకు మళ్లీ ప్రయత్నం చేస్తోందని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. సోమవారం మార్కెట్ యార్డులో విలేకరులతో మాట్లాడుతూ, జాతీయ విధానం పేరుతో దొడ్డిదోవన నల్ల చట్టాలను తెస్తే పోరాటం చేస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్‌లు ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు.

దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అద్దె చెల్లింపు విషయంలో చోటుచేసుకున్న ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం స్థానిక మారీసుపేటకు చెందిన కోట కోటేశ్వరావు (68) తన ఇంటిని చిరు వ్యాపారి లీలా వెంకటేశ్వరావుకు అద్దెకు ఇచ్చాడు. అద్దె చెల్లింపుల విషయంలో జాప్యం జరగడంతో డబ్బులు చెల్లించాలని శనివారం రాత్రి వెంకటేశ్వరావుని, కోటేశ్వరావు గట్టిగా అడగటంతో ఇద్దరి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. వెంకటేశ్వరావు కోటేశ్వరావుని కొట్టగా కింద పడి తలకు రక్తగాయం అయింది. స్థానికులు కోటేశ్వరావును జిల్లా వైద్యశాలకు తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని అన్న కుమారుడు రామ మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30న డాక్ అదాలత్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30వ తేదీన డాక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు సోమవారం తెలిపారు. పోస్టల్ రీజినల్ పోస్ట్ మాస్టర్ జనరల్ విజయవాడ వారి ఉత్తర్వులు మేరకు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన డాక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఖాతాదారులు తపాల సేవలు పొందటంలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే ఉదయం 11గం. నుంచి సంప్రదించాలన్నారు. వ్యక్తిగతంగా హాజరు కావడానికి వీలులేనివారు ఈ నెల 27వ తేదీలోపు తమ ఫిర్యాదులను లేఖ ద్వారా ఈ చిరునామాకు డాక్ అదాలత్, పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్, తెనాలి డివిజన్, తెనాలి - 522201. పంపాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుల నిరసన

తెనాలి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ రాష్ట్రపతికి రాసిన లేఖను సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. కృష్ణా డెల్టాలో వరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మరో వినతిపత్రం ముఖ్యమంత్రి పేరిట సబ్ కలెక్టర్‌కు అందజేశారు. మద్దతు ధర అందేలా చూడాలని కోరారు.

26న దుకాణాల లీజు వేలం

పొన్నూరు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి దేవస్థానాలకు చెందిన 1 నుంచి 7వ నంబరు షాపు వరకు లీజుకు ఇవ్వటానికి ఈ నెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తునట్లు ఆలయ ఈవో గద్దె అమర్నాథ్ సోమవారం తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

తెనాలి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల రద్దు కోరుతూ సుల్తానాబాద్‌లో సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. విద్యుత్ బిల్లులను దహనం చేశారు. దేశంలో 17వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలి, వెంకటసుబ్బయ్య, రాంబాబు, శివారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పనుల పరిశీలన

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించి నిర్మాణాలను చేయవద్దని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ హెచ్చరించారు. సోమవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంలో రోడ్డు మార్జిన్ ఆక్రమించి ర్యాంప్‌ను నిర్మిస్తున్న భవన యజమానిని పిలిచి ర్యాంపును, నిర్మిస్తున్న మెట్లను తొలగించాలని లేకుంటే తమ సిబ్బంది తొలగిస్తారని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలని రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించరాదని కోరారు. అందరూ సహకరించినప్పుడే సుందర తెనాలి సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టీపీవో సాంబశివరావు, ఏఈ సూరిబాబు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే

తెనాలి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ తులసి మాట్లాడుతూ, విద్యార్థులకు నైపుణ్యాలు అవసరమన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే నేర్చుకున్న అంశాలతో పాటు ఆంగ్ల భాష పరిజ్ఞానం, నాయకత్వ ధోరణి, బృంద చర్చలలో నైపుణ్యాలు అవసరమన్నారు. కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అజయ్, అధ్యాపకులు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

● నిర్మించి ఏళ్లు గడుస్తున్న వైనం
● వడ్డిముక్కల్లో ప్రజాధనం వృథా

పొన్నూరు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు నేడు నిరుపయోగంగా మారాయి. మండల పరిధిలోని వడ్డిముక్కలలో భవన సముదాయాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నప్పటికీ వినియోగంలోకి రాకపోవటంతో క్రమేపి అవి శిథిలమవుతున్నాయి. వడ్డిముక్కల గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.40 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. దాతలు ఇచ్చిన స్థలంలో భవన నిర్మాణం చేపట్టారు. అయితే అప్పటికే వడ్డిముక్కల గ్రామాన్ని పురపాలక సంఘంలో విలీనం చేయాలని పాలకులు ప్రభుత్వానికి విన్నవించారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీల అనుమతులు లేకుండా పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన ఆరు గ్రామాలను విలీనం చేయటానికి



రూ. 40 లక్షలతో నిర్మించిన వడ్డిముక్కల సచివాలయం



రూ.10 లక్షలతో నిర్మించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్

ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటంతో గ్రామ పంచాయతీలు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం వడ్డిముక్కల, చింతలపూడి, ఆలూరు, కట్టెంపూడి, ఇటికంపాడు గ్రామాలను విలీనం చేస్తూ ఆదేశాలు జారీచేసింది. అంతే కాకుండా ఈ గ్రామాలను పంచాయతీరాజ్ వ్యవస్థ నుంచి తొలగించటంతో గ్రామాలు అటు పురపాలక సంఘంలో చేరక, ఇటు పంచాయతీరాజ్ వ్యవస్థలో లేకుండా పోవటంతో అభివృద్ధికి దూరమయ్యాయి. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టి పూర్తిచేయాల్సిన పనులన్నీ అర్ధాంతరంగా ఆగిపోయాయి.

సచివాలయాన్ని రూ.40 లక్షలతో పూర్తి అయినప్పటికి వినియోగంలోకి రాలేదు. అలాగే రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌సైతం నిరుపయోగంగా మారింది. 2020 నుంచి ఈ భవనాలు నిర్వహణ లేకపోవటంతో పిచ్చి చెట్లు మొల్చి క్రమంగా శిథిల స్థితికి చేరకుంటున్నాయి. ఈ భవనాలను వినియోగంలోకి తెచ్చి ఉపయోగించుకునేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డాక్టర్ కొత్త మధుమూర్తిది మా ఊరే..!

● సంగం జాగర్లమూడి వాసుల ఆనందం ● రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా నియామకం



డాక్టర్ మధుమూర్తి

తెనాలి క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా డాక్టర్ కొత్త మధుమూర్తి రాష్ట్ర ప్రభుత్వం నియమించగా, ఆయనది మా ఊరేనంటూ సంగం జాగర్లమూడివాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మధుమూర్తి తాత కొత్త సాంబయ్యకు ఆ గ్రామంలో సెంటు భూమి లేదు. ముగ్గురు మగ పిల్లలు, ఒక కుమార్తె సంతానం. వీరిని చదివించే స్తోమత సాంబయ్యకు లేదు. కూలి పనులతోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు. కానీ పిల్లలను ఎలాగైనా బాగా చదివించాలన్న కోరికతో కుటుంబ పెద్దలు, గ్రామస్థుల ఒత్తిడితో చివరికి పెద్ద కుమారుడు కోటేశ్వరరావును తెనాలి తాలూకా హైస్కూల్ ఎస్ఎల్‌సీ చేర్పించాడు. రోజు 14 కి.మీ నడిచి వెళ్లేవాడు. అనంతరం గుంటూరు హిందూ కళాశాలలో ఎఫ్ఏ చదివి మంచి మార్కులు రావడంతో మద్రాసు గిండీ ఇంజనీరింగ్ కళాశాలలో 1947లో సివిల్ ఇంజనీరింగ్‌లో చేరాడు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో అమెరికాలోని అయోవా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1959 వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కళాశాల అప్పటి ప్రధాని నెహ్రూ ప్రారంభించారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో నక్సలైట్స్ నేతలు కొండపల్లి సీతారామయ్య, సత్యమూర్తిల ప్రభావం విద్యార్థులపై అధికంగా ఉండేది. ఇది గుర్తించి అప్పటి ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి హెచ్‌సీ శరీన్ పట్టుబట్టి డాక్టర్ కోటేశ్వరరావును వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. 16 సంవత్సరాల పాటు ప్రిన్సిపాల్‌గా అక్కడే పని చేసి అదే కాలంలో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సూచనల మేరకు ఇంటర్మీడియట్ తర్వాత ఎంసెట్ ప్రవేశ పరీక్షల రూపకల్పనకు, పీజీ కోర్సులలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గేట్ ప్రవేశ పరీక్షల విధివిధానాలను డాక్టర్ కోటేశ్వరరావు రూపొందించారు. వీరి కుమారుడు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ కొత్త మధుమూర్తి తండ్రి బాటలోనే నడిచారు. మధుమూర్తి ప్రస్తుతం వరంగల్ ఎన్ఐటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గాను, బోర్డు ఆఫ్ గవర్నర్స్‌లో ఒకరిగా ఉన్నారు. ప్లేస్‌మెంట్ అధికారిగా ఉన్న సమయంలో ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ ట్రైనర్‌గా ఎంతో మంది విద్యార్థులను దేశ విదేశాల్లో ఉన్నత స్థితిలో నిలిపారు. డాక్టర్ మధుమూర్తి సమర్థతను గుర్తించే విద్యారంగానికి నూతన ఒరవడిని, పంథాను తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనను ఉన్నత విద్యమండలి చైర్మన్‌ని చేసిందని మేనమామ పరుచూరి సురేష్, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కుటుంబ సభ్యులతో డాక్టర్ మధుమూర్తి

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న గణేష్‌యూత్ కన్వీనర్ మురళి

తెనాలి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వైసీసీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ నేతలను సత్కరించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శామ్యూల్, కో-ఆర్డినేటర్లు ఆనందన్న, చిట్టిబాబు, అబ్రహం, స్టీఫెన్, లెనిన్ పాల్గొన్నారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎండీ మురళీకాంత్ కేక్ కట్ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు క్రిస్మస్ శుభాకాంక్షలు అందించారు. 32వ వార్డులో యువజన కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళీ క్రిస్మస్ సందేశం అందించి కేక్ కట్ చేశారు. రెవ.భానుప్రసాద్, రమేష్, సాయిరామ్, చిరంజీవి, రాజ్‌కుమార్, నవీన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● కొల్లిపర: కొల్లిపర తహసీల్దార్ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ సిద్ధార్థ, సీఎస్ డీటీ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ ఉప్పాల రమేష్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు డీలర్లు, అధికారులు ప్రార్థనలు నిర్వహించి ఏసుక్రీస్తు గురించి పలు సందేశాలను తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌వో మనోహర్‌రెడ్డి, డీలర్లు, ఎండీయూ వాహనదారులు, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పాటు పడతాం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశానికి అన్నం పెట్టే రైతు సంక్షేమానికి పాటుపడటమే పాలకుల ధ్యేయంగా ఉండాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. సోమవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఆయన రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులు నిరాదరణకు గురయ్యారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాష్ట్రంలో తుఫాన్లు భారీ వర్షాలకు పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతే ఎకరానికి రూ.10,000 రైతు ఖాతాల్లో జమచేసి రైతులను ఆదుకున్నామన్నారు. వైసీపీ పాలనలో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. రైతుల ఆదాయం పెంచేలా ప్రభుత్వాలు పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రైతు లాభసాటి సాగు పద్ధతులు అవలంబించాలని సూచించారు. సంగం డెయిరీ ద్వార రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను చూపిస్తున్నామని వివరించారు. రైతులను ఆదుకునేందుకు తాము నిరంతరం పాటుపడతామని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు.



అబాకస్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అబాకస్ పోటీలలో ప్రెసిడెన్సీ విద్యార్థుల ప్రతిభ

పొన్నూరు టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అబాకస్ జిల్లా స్థాయి పోటీలలో ప్రెసిడెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ వాసిరెడ్డి బన్ బాబు తెలిపారు. సోమవారం విద్యార్థుల అభినందన కార్యక్రమంలో పాఠశాలల్లో జరిగిన జూనియర్ లెవల్లో వి ఈశ్వర్ మూడో బహుమతిని గెలుచుకున్నారు. ఈశ్వర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ ఆశాలత తదితరులు అభినందించారు.

12ఏళ్ల క్రితం రేట్లకే రిజిస్టర్ చేయమన్న అర్జీపై విచారణ

తెనాలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 12ఏళ్ల క్రితం పంట భూమిని కొనుగోలుకు చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారమే రిజిస్ట్రేషన్ చేసేలా చూడాలని ఓ రైతు డిస్ట్రిక్ ఆడిట్ కమిటీకి అర్జీ పెట్టుకున్నారు. దీనిపై సోమవారం కమిటీ సభ్యులు మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, పలువురు సభ్యులు కలిసి మండలంలోని అంగలకుదురు, నందివెలుగు గ్రామాల్లో విచారణ చేపట్టారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ గత 12ఏళ్ల క్రితం భూమి కొనుగోలుకు రైతు అగ్రిమెంట్ చేసుకోగా అప్పటి విలువ ఆ భూమి ఎకరం రూ.7లక్షలు ఉంది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెళితే దాని విలువ దాదాపుగా రూ.45లక్షలుగా పెరిగింది. దీంతో తాను గతంలో అగ్రిమెంట్ చేసుకున్న ధరలకే రిజిస్ట్రేషన్ చేయించాలని దరఖాస్తుచేసుకున్నారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహరావుకు ఘన నివాళి



పీవీ నరసింహరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెనాలి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక సంస్కరణలకు దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహరావు పునాదులు వేశారని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు చెప్పారు. స్థానిక బోసురోడ్డులో సోమవారం పీవీ వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు రాష్ట్రానికి చెందిన తొలి వ్యక్తి ప్రధాని పదవి చేపట్టి తగిన సంఖ్యాబలం లేని పరిస్థితుల్లో కూడా పూర్తికాలం దేశాన్ని పరిపాలించారని చెప్పారు. తీవ్రవాదాన్ని సమర్థవంతంగా అణచి వేయడంతో పాటు పొరుగు దేశాలతో మంచి సంబంధాలను నెలకొల్పారని గుర్తుచేశారు. అణు పరీక్షలను దేశ ప్రయోజనాల కోసం ఆయన హయాంలోనే మొదలు పెట్టారన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, శివకుమార్, బుల్లియ్య, ద్వారకా శీను, దారా రామకృష్ణ, స్టీవెన్‌బాబు, వీరస్వామి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు వెస్ట్‌బెర్రి విద్యార్థి ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

తెనాలి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి స్కూల్ విద్యార్థి పి.సాయి ఏక్‌నాథ్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ చాంపియన్ పోటీలకు ఎంపికయ్యాడు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం విలేకరులతో మాట్లాడుతూ, డిసెంబరు 27 నుంచి 29 వరకు పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో జరగనున్న నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు. పోటీల్లో విజయం సాధించి రాష్ట్రానికి పేరు తేవాలని కోరారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావును గెలిపించాలి: లక్ష్మీనారాయణ

పొన్నూరు టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రానున్న కృష్ణా - గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం చేబ్రోలు ఉపాధ్యా భవన్లో సిహెచ్ హనుమంతరావు అధ్యక్షతన ఉపాధ్యాయ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా నిరుద్యోగ సమస్యపై లక్ష్మణరావు పోరాడుతున్నారన్నారు. పీఆర్‌సీ ప్రకటించినప్పుడు ఉద్యోగుల సమస్యలపై అంగనవాడీ సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడారన్నారు. కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఐ శ్రీనివాసరావు, కో కన్వీనర్‌గా సిహెచ్ హనుమంతరావు ఎన్నుకున్నారు.

బీఎస్‌ఎఫ్‌లో చేరిన పూర్వ విద్యార్థినికి సన్మానం

తెనాలి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో చేరిన పూర్వ విద్యార్థిని ఎద్దు మహాలక్ష్మిని సోమవారం ఐతానగర్ మున్సిపల్ స్కూల్‌లో ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో జయంతిబాబు మహాలక్ష్మిని, దేశాన్ని రక్షించే గురుతర బాధ్యతను నిర్వహించేందుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో భాస్కర్, బాలయ్య, బెల్లంకొండ వెంకట్, అనసూయ, కమిటీ చైర్మన్ కిరణ్, ప్రసూన, రత్నకుమారి, నీలిమ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి కృషి

● ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్



అర్జీలు స్వీకరిస్తున్న ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్, తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సమస్య సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవర్ స్వాప్నిల్ జగనాథ్ (ఐఏఎస్) చెప్పారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకుని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం నాలుగు అర్జీలు అందగా వాటిలో పంట పైరుకు సంబంధించి ఒక అర్జీ, మరో రెండు సర్వేకి, కాలనీలో పట్టా ఇచ్చి స్థలం చూపలేదని మరొకటి అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ వెల్లడించారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు



పరిష్కార వేదికలో అర్జీలను స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కి ఒక అర్జీ, టౌన్ ప్లానింగ్ విభాగానికి మరో అర్జీ వచ్చిందని తెలిపారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చండీ దేవసేన, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరులో రెండు ఫిర్యాదులు

పొన్నూరు టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పరిష్కార వేదికకు సర్వే కోసం 1, పట్టదారు పాస్ పుస్తకం కోసం-1 దరఖాస్తు అందాయి. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయాలి

● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎండీయూ వాహనదారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నిత్యావసరాల పంపిణీపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ నిత్యావసరాల పంపిణీ విషయంలో ఎటువంటి అవకతవకలు జరిగినా వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా రేషన్ డీలర్లు తగిన సమయంలో డీడీలు అందజేయాలన్నారు. సమావేశంలో సీఎస్ డీటీ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ ఉప్పాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజం జయంతి

కొల్లిపర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసరామానుజం చిత్రపటానికి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఎవరూ సాధించలేని అనేక గణిత సమస్యలను పరిష్కరించినట్లు తెలియజేశారు. శ్రీనివాసరామానుజంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు గణిత శాస్త్రంలో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, రిటైర్డ్ ఎంఈవో ఆరిమండ బసవకుటుంబరెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఈదా సాంబిరెడ్డి, ఉపాధ్యాయులు ఎన్‌డీవీఆర్ ఫణి, భూపతినాయుడు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.